

# ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో 'అలయ్ బలయ్'

**ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు**

**హైదరాబాద్, అక్టోబరు 13,ప్రభాతవార్త:** నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో 'అలయ్ బలయ్' ఆకట్టుకుంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించాయి. ఆదివారం హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఢంకా మోగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాకారుల సంప్రదాయ నృత్యాలు, కోలాటం, గిరిజన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

పోతరాజుల విన్యాసాలు, హైదరాబాదీ సంప్రదాయ మార్ఫా వాయిద్య సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఉత్తరాఖండ్ గవర్నర్ గుర్మిత్‌సింగ్, ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి పాల్గొన్నారు. కాగా,ఏటా దసరా మరుసటి రోజు అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.



హైదరాబాద్ వార్త



పూజలోపాల్గొన్న హర్యానా గవర్నర్ దత్తన్న, పోలీసుకమిషనర్ సి.వి.ఆనంద్

## ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శ్రీరాముని పట్టాభిషేకం

**పాల్గొన్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, పోలీసు కమిషనర్ ఆనంద్**

**గన్‌ఫౌండ్రి, అక్టోబరు 13 ప్రభాతవార్త:** రామాయాణ్ మేళా, ఎగ్జిబిషన్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో విజయ దశమిని పురస్కరించుకుని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించిన శ్రీరామున్ని పట్టాబిషేకం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హర్యానా గవర్నర్ దత్తన్న, నగర పోలీసు కమిషనర్ సి.వి.ఆనంద్ విచ్చేశారు. ముందుగా వారు సీతా, రామ లక్ష్మణ, హన్‌మంత్ వేషధారణ చిన్నారులకు స్వాగతం పలికారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ చెడుపై విజయమే విజయదశమి అని అన్నారు. సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ కోసం కృషి చేస్తున్న రామాయణ్ మేళా, ఎగ్జిబిషన్ సొసైటీని అభినంధించారు. అనంతరం రావణ దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గోవింద్‌రాఠి, గిరిధర్‌లాల్‌డాగా, సుమిత్‌రాఠి, నిరంజన్, సురేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

## బర్త్‌డే పార్టీలో గొడవ... స్నేహితుడి దారుణ హత్య..

**జగద్గిరిగుట్ట, అక్టోబరు 13, ప్రభాతవార్త :**

బర్త్‌డే పార్టీలో అనుకోకుండా స్నేహితుల మధ్య జరిగిన గొడవ ఏకంగా హత్యకు దారి తీసింది. ఈ విషాద ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దీనబంధు నగర్‌లో నివాసముండే నదీమ్ (24) బ్యాండ్ వాయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి పుట్టినరోజు వేడుకల్లో భాగంగా మద్యం సేవించిన స్నేహితుల మధ్య మాట పెరిగి ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో సమాచారం అందుకున్న జగద్గిరిగట్టు పోలీసులు వారిని వారించి అక్కడ నుంచి పంపేశారు. అనంతరం మద్యం మత్తులో ఇంటికి వెళ్లి గొడవపడ్డారు. ఈ క్రమంలో స్నేహితులు ఓ రాడ్‌తో తలపై కొట్టి నదీమ్‌ను హత్య చేసినట్లుగా సమాచారం. ఆదివారం తెల్లవారు జామున సుమారు 3 గంటల ప్రాంతంలో నదీమ్ హత్యకు గురైనట్లు పోలీసులు భావిస్తున్నారు. జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# నగరంలో గుప్పుమంటున్న గంజాయి..

*** గంజాయి మత్తులో రెచ్చిపోతున్న గ్యాంగ్‌లు * జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాలలో విచ్చలవిడి అమ్మకాలు..**



**పంజగుట్ట, అక్టోబరు 13 (ప్రభాతవార్త):** హైదరాబాద్ నగరం అంటే ఒకపుడు స్వచ్ఛమైన జీవన విధానానికి మారుపేరు..మిగతా మెట్రో పాలిటన్ నగరాలకంటే హైదరాబాద్ సేఫ్ అని..పక్క రాష్ట్రాల్లో అనుకునేవారు. కానీ ఇపుడు నగరం గంజాయికి హబ్‌గా మారిపోయిందా? అనే అనుమానం కలగకమానదు. నగరంలో ఎక్కడ చూసినా గంజాయి అమ్మకాలు జోరందుకుంటున్నాయి. పాకెట్ వేయి రెండు వేలకు అమాయకులైన కుర్రకారు చేత గంజాయి స్మగ్లర్స్ అమ్మకాలు సాగిస్తున్నారు. ఒకవేళ పట్టుబడితే అమాయకులైన యువత జైళ్ళ పాలవుతున్నారు తప్ప అసలు అమ్మకం దారుల ఆచూకీ కనిపెట్టడంలో అధికార యంత్రాంగం విఫలమవుతుందనే చర్చ నగరవ్యాప్తంగా సాగుతోంది. జూబ్లీ హిల్స్‌లాంటి ప్రాంతాలలోనే ఈ మధ్య కాలంలో కిలోల చొప్పున పెద్దఎత్తున గంజాయిని ఎక్సయిజ్ పోలీసులు పట్టుకున్నారు అంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఆంధ్రాలోని ఉత్తరాంధ్ర, ఒరిస్సా సరిహద్దుల నుండి నగరానికి గంజాయి సరఫరా అవుతున్న విషయం బహిరంగ రహస్యమే. అక్కడ నుండి అక్రమ మార్గాల ద్వారా, అక్రమార్కులకు డబ్బులు ముట్టచెప్పి గుట్టుచప్పుడు కాకుండా నగరానికి గంజాయిని తరలిస్తున్నారు.పోలీసులకు ఎవరైనా విశ్వసనీయమైన సమాచారం ఇస్తే తప్ప పట్టుకోవడం కష్టంగా మారింది. ఆంధ్రాలో ముఖ్యంగా ఉత్తరాంధ్రలో అక్కడి ప్రభుత్వం గంజాయి అమ్మకాలపై ఉక్కుపాదం మోపడంతో పాటు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి గంజాయి అమ్మకాలపై తీవ్ర చర్యలు చేపట్టింది.దీంతో అమ్మకందారుల కన్ను నగరంపై పడింది. దీనికితోడు నగర యువత దీనికి ఈజీగా బానిస అవుతుండడంతో అక్రమార్కుల అమ్మకాలు మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగిపోతున్నదని పలువురు పోలీసులే అంతర్గత సంభాషణలలో అంగీకరిస్తున్నారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్ లాంటి పోష్ ఏరియాల్లో కూడా తరచుగా గంజాయి అమ్మకందారులు పట్టుబడుతున్నారంటే వారికి అమ్మకాల విషయంలో ప్రాంతమేదీ అనేది అనవసరమని, ఎక్కడ ఎక్కువ కొనుగోళ్లు జరుగుతుంటే అక్కడ వాలిపోతుంటారని పోలీసులే వ్యక్తిగతంగా వ్యాఖ్యలు చేస్తున్నారు.

గంజాయి సేవించిన వారి చేష్టలకు అడ్డూ అదుపూ లేకుండా పోతుంది. వారేం చేస్తున్నారో వారికే తెలియని స్థితిలోకి గంజాయి మత్తు వారిని నెట్టడంతో మానవ మర్యాదలు మరచిపోయి ప్రవర్తిస్తున్నారు.ఉదాహరణకు రంగారెడ్డి జిల్లాలో గంజాయి గ్యాంగ్‌లు రెచ్చిపోతున్నారు. రెండు రోజుల క్రితం రాజేంద్రనగర్ హైదర్ గూడలో వాకర్స్‌పై గంజాయి బ్యాచ్ దాడికి దిగింది. పార్కింగ్ ప్రదేశంలోఉన్న కార్ల అద్దాలను పగలకొడుతుండగా కొంతమంది అడ్డుకున్నారు. ఈ ప్రాంతంలో పోకిరీలు ఎక్కువగా గంజాయి, మాదక ద్రవ్యాలు సేవించి స్థానికులపై దాడులు చేస్తున్నారని ఇక్కడి వారు తరచుగా వాపోతూనే ఉన్నారు. ఈ ప్రాంతం నిర్మానుష్యంగా ఉండడంతో తెల్లవారు జామున వాకింగ్‌కు వచ్చేవారిపై దాడులకు దిగుతున్నారు. రెండు రోజుల క్రితం ఐదుగురు యువకులు పూర్తిగా గంజాయి సేవించి వాకింగ్‌కు వచ్చేవారిపై అసభ్యంగా ప్రవర్తించారని వాకర్స్ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ జరిగిన సంఘటన ఒక ఉదాహరణ మాత్రమే. నగరం, చుట్టుపక్కల ప్రాంతాలలో నిత్యం ఏదో ఒకచోట గంజాయి సేవించి దాడులకు దిగుతున్న సంఘటనలు కోకొల్లలుగా జరుగుతున్నాయి. కొంతమంది మాత్రమే పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నా ఎక్కువ మంది మాత్రం మనకెందుకులే గొడవలు అనుకుంటూ వారినుంచి తప్పించుకుని తిరుగుతున్నారని మాదాపూర్‌కు చెందిన ఓ కానిస్టేబుల్ తెలిపారు.

విశ్వసనీయ సమాచారం ప్రకారం..కిలో గంజాయి నగరానికి తరలిస్తే పదివేల రూపాయలు ముట్టచెబుతున్నారు. కిలో గంజాయిని ఇక్కడి వారు గ్రాములలో పాకెట్‌లలో ప్యాక్‌చేసి మైనర్ బాలుర ద్వారా ఎక్కువగా అమ్మకాలు సాగిస్తున్నారు.వీరు 20 గ్రాముల గంజాయి పాకెట్‌ను రెండు వేల రూపాయలకు విక్రయిస్తున్నారని సమాచారం.అమ్మకాలు సాగించే మైనర్ బాలురకు వీరు పాకెట్‌కు ఐదు వందల దాకా ఇస్తుండడంతో అభం శుభం తెలియని చిన్నారులు వీటిని అమ్మకాలు సాగిస్తూ పోలీసులకు చిక్కితే ఊచలు లెక్క పెడుతున్నారు. ఇలా అరెస్ట్ అయి జైలు పాలైన వారికి బెయిల్ ఇచ్చే దిక్కు కూడా ఉండదని, ఒకవేళ న్యాయమూర్తి దయతలచి వీరికి బెయిల్ మంజూరు చేసినా ష్యూరిటీ పెట్టి బయటకు తీసుకొచ్చే వారే ఉండరని ఓ పోలీసు అధికారి వ్యాఖ్యానించాడు. ఇలా నెలల తరబడి బెయిల్ వచ్చినా జైళ్లలో మగ్గిపోతున్నవారు ఇప్పటికీ వందల్లోనే ఉంటారని ఆయన వ్యాఖ్యానించారు.

నగరంలో గంజాయి అమ్మకాలు అంటే ఎక్కువగా అందరికీ గుర్తుకు వచ్చేది..ధూల్‌పేట్..అటు పోలీసులు కానీ ఇటు ఎక్సయిజ్ అధికారులు కానీ ధూల్‌పేట మీదే ఎక్కువగా దృష్టి పెడుతూ ఉంటారు. అయితే గంజాయి స్మగ్లర్లు పోలీసులకంటే ఆరు ఆకుల ఎక్కువే చదివి ఉంటారు. పోలీసుల దాడుల నుంచి ఎలా తప్పించుకోవాలి, రవాణా ఎలా చేయాలనే విషయంలో పలు రకాల పద్ధతులను అవలంభిస్తూ పోలీసులకే సవాల్ విసురుతున్నారు. ధూల్‌పేటను ఒక బూచిగా చూపించి మిగతా ప్రాంతాలలో సరుకును స్టాక్ పెట్టుకుంటూ అమాయకులు, పేదవారు, ముఖ్యంగా యువకులను ఈ ఊబిలోకి లాగుతున్నారని సమాచారం.

అంతెందుకు పోలీసులు, ఎక్సయిజ్ శాఖ వారు ఈ మధ్య కాలంలో తరచుగా గంజాయితో పట్టుబడ్డ వ్యక్తులు అరెస్ట్ అని ప్రకటనలు చేస్తున్నారే తప్ప ఒక్క గంజాయి డాన్‌ను అయినా పట్టుకున్నారా అని నగరానికి చెందిన ఓ రిటైర్డ్ ఎక్సయిజ్ ఇన్‌స్పెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ఉన్న తాధికారుల నుండి వత్తిడి వచ్చినపుడు ఏదో తూతూ మంత్రంగా దాడులు చేయడం, అక్కడున్న సహాయకు లను అదుపులోకి తీసుకోవడం తప్పితే స్మగ్లింగ్ చేసే వారి మూలాల్లోకి వెళ్లి దీనిని సమూలంగా నిర్మూలిం చడానికి తగిన కార్యాచరణ ఏ అధికారి అయినా చిత్తశుద్ధి తో చేస్తున్నాడా అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

నగర యువత పూర్తిగా గంజాయికి బానిసలుగా కాక ముందు ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించవలసి ఉంది.లేకుంటే ప్రశాంత నగరానికి మారుపేరుగా ఉన్న హైదరాబాద్‌ను ఇతర ప్రాంతాల వారు చులకనగా చేసి మాట్లాడే ప్రమాదం ఉందని పలువురు నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఘనంగా విజయదశమి ఉత్సవాలు

**ముఖ్య అతిధులుగా హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ నేత విహెచ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్**

**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం విజయదశమి సందర్భంగా మహంకాళి అమ్మవారిని రాజరాజేశ్వరిగా అలంకరించి ప్రత్యేక పూజలు, జమ్మి పూజ నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా మున్సిపల్ గ్రౌండ్‌కు తీసుకువచ్చి, ధ్వజారోహణ నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. రాజమండ్రి కళాకారులు తయారుచేసిన ఆకాశ దీపాలు, గన్‌రాకెట్స్, క్రాకరింగ్ ట్రీ, ఎస్.వీల్, స్టార్‌వీల్, రాకెట్ రింగ్స్‌వంటి అనేక రకాల బాణాసంచాలను కన్నుల పండువగా కాల్చారు. అనంతరం 25 అడుగుల ఎత్తుతో పదితలల రావణాసురుడిని దహనం చేశారు. ఈ కార్యక్రమానికి హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్‌నేత వీ. హనుమంతరావు, అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌లు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి అధ్యక్షులు వై.శంకర్‌గౌడ్, చీఫ్ అడ్వైజర్ కె.దుర్గాప్రసాద్‌రెడ్డి, చైర్మన్ పి.జ్ఞానేశ్వర్‌గౌడ్, వైస్ ఛైర్మన్ గడ్డం లక్ష్మణ్‌గౌడ్, ఉపాధ్యక్షులు రంగంపల్లి రాజు, ప్రధాన కార్యదర్శి బింది మల్లిఖార్జున్‌గౌడ్, నాయకులు చెంగల్ సుధాకర్, దోమికొండ కిషోర్, గడ్డం శ్రీధర్‌గౌడ్, పి.గిరిధర్‌గౌడ్, చింతల శ్రీనివాస్ ముదిరాజ్, ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ జోగుల నర్సయ్య, కావ్యకిషన్‌రెడ్డి, కార్పొరేటర్లు ఈ.విజయ్ కుమార్, బి.పద్మావెంకట్‌రెడ్డి, కన్నె ఉమా రమేష్ యాదవ్, వై.అమృత, మాజీ కార్పొరేటర్‌లు కే.పద్మావతి, డి.పి.రెడ్డి, పుల్లా నారాయణస్వామి, బి.వెంకట్‌రెడ్డి, వనం రమేష్, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ రోహిణ్‌రెడ్డి పాల్గొనగా అంబర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ అశోక్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.



దసరా ఉత్సవాలలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు తదితరులు

# ఉప్పల్‌లో భారత్, బంగ్లాదేశ్ టి-20 మ్యాచ్ క్రికెట్ సందడి..!

**తరలివచ్చిన ప్రేక్షకులు.. మ్యాచ్‌లో రికార్డుల మోత**

**ఉప్పల్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంత ర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన భారత్,బంగ్లాదేశ్ టి-20 క్రికెట్ మ్యాచ్‌తో ఉప్పల్‌లో సందడి నెలకొంది. మ్యాచ్ చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రేక్షకులు భారీగా తరలివచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచే స్టేడియంకు వెళ్లే రహదారులు కిటకిటలాడాయి. స్టేడియానికి వెళ్లే రహదారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాచకొండ పోలీసుల ఆధ్వర్యంలో స్టేడియం వద్ద భారీ ఎత్తున భద్రతా ఏర్పాట్లు చేశారు. భారత జట్లు భారతీయ టి-20 మ్యాచ్ చరిత్రలోనే అత్యధిక స్కోర్ నమోదు చేసింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లల్లో ఆరు వికెట్లకు 297 పరుగులు భారీ స్కోర్ చేసింది. సంజూ శాంసన్ 47 బంతులలో 11 ఫోర్లు, 8 సిక్స్‌లతో 111 స్కోర్ చేశారు. సూర్యకుమార్ యాదవ్ 35 బంతులలో 11 ఫోర్లతో 8 సిక్స్‌లతో 75 స్కోర్‌తో సత్తా చాటారు. లక్ష్యఛేదనకు దిగిన బంగ్లాదేశ్ 20 ఒవర్లలో 7 వికెట్లు కోల్పోయి 164 పరుగుల మాత్రమే చేయగలిగింది. మ్యాచ్ వీక్షించేందుకు 39 వేల మంది వస్తారని అంచనా వేయగా, దసరా పండుగ సందర్భంగా ప్రేక్షకుల నుంచి అంతగా స్పందన రాలేదు. స్టేడియం భద్రత కోసం సుమారు 2వేల మంది పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. స్టేడియం వద్ద అన్ని గేట్ల వద్ద ఎసిపి స్థాయి అధికారిని పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ప్రేక్షకులను టిక్కెట్లను పూర్తిస్థాయిలో తనిఖీలు చేసి లోపలికి పంపించారు. మ్యాచ్ వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి మెట్రో రైళ్ల, ఆర్టీసీ బస్సులలో అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్టేడియం పరిసరాల్లో సుమారు 340 కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. మ్యాచ్ చూసేందుకు వచ్చిన ప్రేక్షకులు తమ వాహనాలను హబ్సిగూడ, రామంతాపూర్ ప్రధాన రహదారిలో రోడ్లపైనే నిలిపివెళ్లారు. కిలోమీటర్ల దూరం నుంచి ప్రేక్షకులు తరలిరావడం కనిపించింది.

**స్టేడియం పరిసరాల్లో ట్రాఫిక్ రద్దీతో ఇక్కట్లు :**

ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఐపిఎల్ టి-20మ్యాచ్‌లతో స్టేడియం బయట కోలాహలం నెలకొంది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచే వివిధ ప్రాంతాల నుంచి ప్రేక్షకులు స్టేడియం లోపలికి రావడం ప్రారంభించారు. సాయంత్రం 7 గంటలకు మ్యాచ్ ప్రారంభ సమయానికి ముందే స్టేడియంకు భారీగా తరలివచ్చారు. స్టేడియం లోపల మూడంచెల భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేయగా, స్టేడియంలోకి వచ్చే దారులను పోలీసులు మూసివేసి టిక్కెట్లు ఉన్న వారినే లోపలికి అనుమతించారు. క్రీడాకారులు పెవిలియన్‌కు వచ్చే సమయంలో ఫోటోలు తీసేందుకు ప్రేక్షకులు పోటీ పడ్డారు.

భారత్, బంగ్లాదేశ్ టి-20 క్రికెట్ మ్యాచ్ చూసేందుకు ప్రేక్షకులు అధికంగా తరలిరావడంతో గ్యాలరీలు నిండిపోయాయి. అధికశాతం మంది కాంప్లమెంటరీ పాసుల కోసమే తంటాలు పడ్డారు. కేవలం తక్కువ రేటు ఉన్న టిక్కెట్లకు మాత్రమే డిమాండ్ ఉండగా, అధిక రేట్లు ఉన్న టిక్కెట్లు కొనుగోలు చేసేందుకు ప్రేక్షకులు ఆసక్తి చూపలేదు. అదే విధంగా పలువురు రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు కాంప్లమెంటరీ పాసులు పొంది తమ బంధువులు, అనుయాయులకు ఇచ్చారు.



రావణ దహనంలో పాల్గొన్న భక్తులు

## సంబరంగా దసరా వేడుకలు

**హైదరాబాద్, అక్టోబరు 13 ప్రభాతవార్త :** దేవీనవరాత్రి ఉత్సవాలు, దసరా సంబరాలను నగరవాసులు వైభవంగా జరుపుకొన్నారు.శనివారం, ఆదివారాల్లో ఈ ఉత్సవాలు కొనసాగాయి. తొమ్మిది రోజులు పూజలందుకున్న అమ్మవారి విగ్రహాలను బ్యాండు మేళతాళాలతో హుస్సేన్‌సాగర్, సరూర్‌నగర్ చెరువు తదితర ప్రాంతాల్లో నిమజ్జనం చేశారు. ఇక శనివారం రాత్రి పలుచోట్ల రావణ దహనం కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నుంచి జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి, చార్మినార్ భాగ్యలక్ష్మి, శ్రీశృంగేరి శంకరమఠంలో శ్రీ శారదాంబ తదితర ప్రముఖ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా..భక్తుల రద్దీతో కిక్కిరిసిపోయాయి. పలుచోట్ల శమీ పూజలను ఘనంగా నిర్వహించారు. ఇక అమ్మవారి ఊరేగింపు సందర్భంగా నిర్వహించిన దాండియా ఆట పాటలు, కోలాటాలు, ఆధ్యాత్మిక శోభను పెంచాయి.దీంతో సిటీలో పలు ప్రాంతాల్లో సందడి నెలకొంది.



దహనం అవుతున్న రావణుడు

## హైదరాబాద్ మేయర్‌పై కేసునమోదు

**పంజగుట్ట, అక్టోబర్ 13 (ప్రభాతవార్త):** బతుకమ్మ కార్యక్రమంలో శబ్ధకాలుష్యం ఉల్లంఘించినందుకు హైదరాబాద్ మేయర్‌పై కేసు నమోదైంది. శబ్ధ కాలుష్య నిబంధనలను ఉల్లంఘిస్తూ బతుకమ్మ వేడుకలకు అనుమతించిన సమయానికి మించి అధిక డెసిబుల్ సంగీతాన్ని అనుమతించారనే ఆరోపణలపై గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిపై బంజారాహిల్స్ పోలీసులు సుమోటోగా కేసునమోదు చేశారు.

## చెడుపై విజయమే దసరా పండుగ : ఎమ్మెల్యే

**సంజీవరెడ్డినగర్, అక్టోబరు 13, ప్రభాతవార్త :** చెడుపై మంచి సాధించిన విజయమే దసరా పండుగ అని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం రాత్రి సనత్‌నగర్‌లోని హనుమాన్ దేవాలయం, దాసారం బస్తీలలో నిర్వహించిన దసరా వేడుకల్లో,రావణ దహనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరికి దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాణసంచా కాల్చి రావణ దహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని, అందరిపై అమ్మ అనుగ్రహం ఉండాలని ఆకాంక్షించారు. హిందువులు జరుపుకునే ప్రతి పండగకు ఒక చరిత్ర ఉందనే విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలన్ లక్ష్మి, బిఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కొలన్ బాల్‌రెడ్డి, నాయకులు సురేష్‌గౌడ్, భూపాల్‌రెడ్డి, రాజేష్ కుమార్, వీరేష్ పాల్గొన్నారు.

**అమీర్‌పేటలో..**

అమార్‌పేటలోని ధరంకరం రోడ్డులోని మున్సిపల్ గ్రౌండ్‌లో శనివారం రాత్రి శ్రీ బాలాజీ రాజస్థానీ మండల్ ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా వేడుకలు, రావణ దహనం కార్యక్రమంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందరిక దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అమీర్‌పేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, శ్రీబాలనీ, రాజస్థానీ మండల్ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రాజ్ పురోహిత్, శీతల్ లడ్డా, అశోక్ సింగ్ రాజ్ పురోహిత్, గులాబ్‌సింగ్, బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, కూతురు నర్సింహ, ఆకుల రాజు తదితరులు పాల్గొన్నారు.

# సుక్క.. ముక్క జోరు..!

**జాతరను తలపించిన మద్యం, మాంసం దుకాణాలు**

**ధరలు పెరిగినా వెనకాడని నగరవాసులు**

**గతంలోకంటే మెరుగ్గా సాగిన లిక్కర్ అమ్మకాలు**



**హైదరాబాద్, అక్టోబరు 13,ప్రభాతవార్త:** దసరా అంటే సరదాల పండుగ. భక్తి మాట పక్కన పెడితే, మందు ముక్క లేనిదే దసరా పండుగ జరగదు.విభిన్న కులమతాల కలయిక గల భాగ్యనగరంలో నగరవాసులు సరదాల దసరాను "ఫుల్"గా ఎంజాయ్‌చేశారు. ముఖ్యంగా మందుబాబులు ముక్క..చుక్కతో పసందు చేశారు. మహానగర పరిధిలో నాలుగు రోజుల్లో వందకోట్లకుపైగా అమ్మకాలు జరిగినట్లు ఆబ్కారీ అధికారులు అంచనా వేస్తున్నారు. మందు బాబుల జోష్ "మూడు ఫుల్లులు ఆరు బీర్లు" అన్న చందంగా అదిరిపోవడంతో ఇటు మద్యం వ్యాపారులు, అటు ఆబ్కారీశాఖ పంట పండింది. ప్రధానంగా, బుధ, గురు, శుక్ర, శనివారాల్లో గ్రేటర్ పరిధిలోని 400 మద్యం దుకాణాలు, 500 బార్లలో సుమారు 110 కోట్ల విలువైన మద్యం అమ్ముడైనట్లు అంచనా వేస్తున్నారు. సాధారణ రోజుల్లో గ్రేటర్ పరిధిలో నిత్యం 10కోట్లమేర వివిధ బ్రాండ్లకు చెందిన మద్యం, బీర్ల అమ్మకాలు జరుగుతాయని గతేడాదితో పోలిస్తే ఈఏడాది 25శాతం మేర పెరుగుదల నమోదైనట్లు అంచనావేస్తున్నారు. ప్రధానంగా 16-35ఏళ్ల మధ్యనున్నవారు బీరును అధికంగా సేవించగా..35-55 మధ్యవయస్కులు విస్కీకి ఓటేయడమ గమనార్హం. జీవనశైలి సమస్యతో బాధపడుతున్నారు బ్రాండీ,రెడ్‌వైన్ వంటి డ్రింక్‌ను కొనుగోలు చేసినట్లు తెలుస్తుంది. దసరాకుముందు రెండురోజుల నుంచే నగరంలోని వివిధ జిల్లా కేంద్రాలు,గ్రామీణ ప్రాంతాలకు తరలివెళ్లిన వారు సైతం నాణ్యమైన సరుకు దొరుకుతుందన్న నమ్మకంతో నగరం నుంచే కొనుగోలు చేసి పల్లెబాట పట్టినట్లు వ్యాపారులు తెలుపుతున్నారు.

**జోరుగా సాగిన మాంసం అమ్మకాలు..**

దసరాకు మందుతోపాటు విందు కూడా ఉండాల్సిందే... శుక్రవారం పండుగ రోజున మటన్ చికెన్ దుకాణాలాన్ని కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. మాంసాన్ని అధిక మొత్తంలో కొనుగోలు చేసేందుకు జనం దుకాణాల ముందు క్యూకట్టారు. వనస్థలిపురంలోని ఓ మటన్‌షాప్ వద్ద మాసంప్రియులు సుమారు 2 గంటలపాటు వేచి ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.సాధారణ రోజుల్లో మటన్ ధరలు రూ.800 ఉండగా పండుగ సందర్భంగా రూ. 900-1000లకు అమ్మకాలు జరిపారు.దీంతో మద్యతరగతి కుటుంబాలు చికెన్‌ను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపించారు. మటన్‌ధరలు పెరగడంతో చికెన్ దుకాణాలకు గిరాఖీ ఎక్కువనే ఉంది. పదిరోజుల క్రితం కిలోచికెన్ 220 ఉండగా,పండుగ పేరుతో 250-270వరకు పెంచేశారు. గ్రేటర్ పరిధిలో సాధారణ రోజు ల్లో రోజుకు 15నుంచి 20లక్షల కిలోల చికెన్ వినియోగం అవుతుండగా పండుగ సందర్భం గా రెండు రోజుల్లో 70లక్షల కేజీల అమ్మకాలు జరిగినట్లు వ్యాపారులు తెలిపారు. శనివారం ఒక్క రోజే దుకాణదారుడు 500నుంచి 800 కేజీలు చికెన్ విక్రయించారని నగరవాసులు చికెన్‌కే అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు వ్యాపారి రజాక్ తెలిపారు.



బేగంపేట శ్రీభూలక్ష్మీ అమ్మ వారి ఆలయంలో దివ్య రామబాణం

## శ్రీభూలక్ష్మీ అమ్మవారి దేవాలయానికి చేరుకున్న దివ్య రామబాణం

### దర్శించుకుని పూజలు నిర్వహించిన సినీ హీరో సుమన్

**బేగంపేట, అక్టోబరు 13, ప్రభాతవార్త :** బేగంపేట ప్రకాశంనగర్ శ్రీభూలక్ష్మీ అమ్మవారి దేవాలయంలో దివ్య రామబాణం చేరుకుంది. దివ్య రామబాణాన్ని చూసి తరించేందుకు సినీనటులు సుమన్, టీఎంసీ బ్యాంకు చైర్మన్ నంగునూరి చంద్రశేఖర్, కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ శ్రీసత్యం శ్రీరంగం, బేగంపేట ఇన్‌స్పెక్టర్ చిర్ర రామయ్య, గంగాధర్‌గౌడ్, అరుణ్‌గౌడ్, సంజయ్ విడియాల, గోవిందరావు, శేఖర్, కృష్ణ, చిరంజీవి, జగదీష్, బాల, మోహిత్‌తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దివ్య రామబాణాన్ని చూసి తరించారు. చల్లా శ్రీనివాస్‌శాస్త్రి కానుకగా అందించిన ఒక కిలో బంగారు, 13 కిలోల వెండితో తయారు చేసిన దివ్య రామబాణం ప్రకాశంనగర్ శ్రీభూలక్ష్మీ ఆలయానికి చేరుకోవడంతో పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ అవకాశాన్ని తమ ప్రాంత భక్తులకు కల్పించిన వారికి ఆలయ నిర్మాణదాత, నవరాత్రి ఉత్సవాల నిర్వాహకులు విశాల్ సూధామ్ కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన అతిధులను విశాల్ సుధామ్ దుశ్శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు.

## టిపిసిసి అధ్యక్షుడిని కలిసిన కోట నీలిమ

**బేగంపేట, అక్టోబరు 13, ప్రభాతవార్త :** టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్‌ని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కోట నీలిమ కల్సి విజయ దశమి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా ప్రజల శ్రేయస్సు కోసం జరుగుతున్న సేవలను మహేష్‌కుమార్‌గౌడ్ కొనియాడారు.

## విద్యార్థులకు నగదు బహుమతులు అందజేత



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న జక్కుల మహేశ్వర్ రెడ్డి

**కంటోన్మెంట్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** దసరా వేడుకలు పురస్కరించుకొని ఎస్.పి.ఆర్. విద్యాసంస్థలో నిర్వహించిన దాండియా, బతుకమ్మ వేడుకల్లో ప్రతిభవన కనబర్చిన విద్యార్థిని విద్యార్థులకు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి ప్రశంసపత్రాలను అందజేసి ఒక్కొక్క విద్యార్థికి 5 వేల రూపాయల నగదు బహుమతులను అంద జేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.పి. ఆర్.గ్రూప్ విద్యా సంస్థల అధిపతి రణదీర్ రెడ్డి, దాండియా, బతుకమ్మ ఉత్సవ నిర్వాహకులు నల్లపోచమ్మ, జయనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా దసరా వేడుకలు



దసరా ఉత్సవాల్లో పాల్గొన్న మ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

**కంటోన్మెంట్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం బోయిన్‌పల్లి సౌజన్యకాలనీలో నిర్వహించిన వేడుకల్లో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎం.ఎల్.ఆర్. విద్యా సంస్థల చైర్మన్ మర్రి లక్ష్మారెడ్డిలు, అరుధంతి ఆసుపత్రి డైరెక్టర్ మర్రి దీరన్ రెడ్డి, డాక్టర్ ఎన్.ఎల్.ఎన్. రెడ్డి, నరేందర్ రెడ్డిలు పాల్గొన్నారు.

## నాగదేవత సహిత పోచమ్మ ఆలయంలో అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న కమిటీ నిర్వాహకులు ఏడుకొండలు

**యూసుఫ్‌గూడ, అక్టోబరు 13, ప్రభాతవార్త :** దేవి నవరాత్రులు సందర్భంగా అల్లాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీవివేకానందనగర్‌లో శ్రీకనకదుర్గ నాగదేవత సహిత పోచమ్మ దేవాలయంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆలయ కమిటి సభ్యులు కలవల ఏడుకొండలు ఆధ్వర్యంలో జరిగిన పూజ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అదేవిధంగా గత 13సంవత్సరాలుగా గూస్వాహ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జీనాలాల్ ద్రౌపతిదేవి దంపతుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు కలవల ఏడుకొండలు, మునగాల పద్మారావు, ముత్యాల శ్రీను, సింహాద్రి వెంకటేశ్వరరావు, గణేషుల నాగేశ్వరరావు, పోలిశెట్టి శ్రీను, కాయితీ యాదవరెడ్డి, పులిగోళ్ళ శ్రీనువాస్‌రావు యాదవ్, గంగుమళ్ళ వరప్రసాద్, గమిడి రాజు, చిలకల కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జమ్మిచెట్టుకు పూజలు నిర్వహించిన కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

**నిజాంపేట్, అక్టోబరు 13, ప్రభాతవార్త :** విజయదశమి సందర్భంగా ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్‌రెడ్డి శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంపేట్ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం అమ్మవారిని అన్ని అవతారాలు రథంపై ఎక్కించి ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొలన్ నరసింహారెడ్డి, కొలన్ భద్రారెడ్డి, పంగా శ్రీనివాసరావు, సత్యం పంతులు తదితరులు పాల్గొన్నారు.



జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

# కుత్బుల్లాపూర్‌లో ఘనంగా విజయదశమి వేడుకలు

**పేట్ బషీరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామంలో, విజయదశమి సందర్భంగా శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో శ్రీ రామాంజనేయ యువజనసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలకు, రావణ దహనకాండ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిసిసి మాజీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, శ్రీ రామాంజనేయ యువజన సంఘం చైర్మన్ కె.ఎం.ప్రతాప్, యువనేస్తం ఫౌండేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షులు కె.పి.విశాల్‌గౌడ్ విచ్చేశారు. ఉత్సవ కార్యక్రమంలో భాగంగా శాంతికి జీవనంగా తెల్లపావురాలను ఎగర వేశారు. ఓం జెండా ఆవిష్కరణ, జమ్మిచెట్టు పూజ, బాణాసంచా అనంతరం రావణ దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరి దేవిని దర్శనం చేసుకుని, ఆ తదుపరి అలై బలై నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామాంజనేయ యువజన సంఘం సభ్యులు, కుత్బుల్లాపూర్ గ్రామంలో, చుట్టు ప్రక్కల కాలనీలలో, బస్తీలలో ప్రైవేట్ వైద్య సేవలను



విజయదశమి వేడుకల్లో పాల్గొన్న కె.యం.ప్రతాప్, విశాల్‌గౌడ్

అందిస్తున్న డాక్టర్లు డా. రామచందర్, డా.సురేష్, డా.స్వాతిరెడ్డి, డా. విశాల్, డా. ఉదయ్‌గౌడ్, డా. విజయ్ ప్రేమ్, ఫార్మసిస్ట్ వెంకటరెడ్డి, ప్రైవేట్ విద్యా సంస్థలను నెలకొల్పి నాణ్యమైన విద్యను అందిస్తున్న స్కూల్ కరస్పాండెంట్‌లను వారి సేవలను గుర్తిస్తూ జగత్‌గౌడ్, మంథని పద్మ, చింతల మానస్ యాదవ్‌లను శాలువాతో సత్కరించి, మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో ఠాకూర్ రాజేందర్ సింగ్, చెరుకుపల్లి శివారెడ్డి, ఉల్పీ సత్తయ్య, గొరిగే సత్తయ్య, వడ్ల శ్రీరాములు, కృష్ణ, శ్రీ రామాంజనేయ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## జీవనసంవేదన చిత్రకారుడు శీలావీర్రాజు

### ప్రఖ్యాతకవి, విమర్శకుడు నాళేశ్వరం శంకరం

***రవీంద్రభారతి, అక్టోబరు 13 ప్రభాతవార్త :*** తెలుగు సాహిత్యంలో మరచిపోలేని సృజనాత్మక రచనలను అందించిన సాహితీకారుల స్మృతిలో ప్రముఖకవి, రచయిత శీలావీర్రాజు సాహిత్యం, జీవితంపై రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ఆదివారం తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన నా దృష్టిలో అనే కార్యక్రమంలో ప్రముఖ కవి, విమర్శకుడు నాళేశ్వరం శంకరం శీలావీర్రాజుపై సమగ్రంగా విశేష ప్రసంగం చేస్తూ ఆయన ప్రయోగవాది, సౌందర్యోపాసకుడు, ప్రకృతి అన్వేషకుడు, సహృదశీలి, ప్రధానంగా మధ్యతరగతి జీవన సంవేదన చిత్రకారుడు అని కొనియాడారు. వీర్రాజు వచన కవిత్వ కథలకు మార్గదర్శి, వచన కథావ్యాసాలకు ఆధ్యుడు కూడా అన్నారు. ఒకరోజు నగర జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకుని మళ్ళీ వెలుగు అనే కావ్యంగా మలిచాలడన్నారు. వచన కవిత్య ఉద్యమానికి కుందుర్తి తర్వాత వచన కవిత్వానికి కర్త ఖర్త క్రియగా ఉంటూ ఆయన స్థాపించిన ఫ్రీవర్స్ ఫ్రంట్ ముందుకు తీసుకెళ్లి ఆ ఉద్యమాన్ని విస్తృతపరిచాడని తెలిపారు. మార్క్సిస్టు భావజాలం కలిగిన వీర్రాజు కిటికీకన్ను, ఎర్రడబ్బా రైలు సంపుటాలతో మధ్యతరగతి సంస్కృతిలో కొట్టుకుపోకుండా నిలబడ్డారని, తెలుగు సాహిత్యంపై చెరిగిపోని కవితాత్మక ముద్ర శీలావీర్రాజు అని నాళేశ్వరం శంకరం విశ్లేషించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖ రచయిత, సాహితీమూర్తులు పాల్గొన్నారు.

## హైడ్రా కమిషనర్ రంగనాద్‌తో కాంగ్రెస్ నేత భేటీ



రంగనాద్‌తో బేటి అయిన కాంగ్రెస్ నేత గడ్డం రవికుమార్ తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 12 ప్రభాతవార్త :** హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో సోమవారం ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గడ్డం రవికుమార్ బేటి అయ్యారు. ఈ మేరకు సోమవారం ఎన్ఆర్ఐ కిరణ్‌తో కలిసి గడ్డం రవికుమార్ తదితరులు హైడ్రా కమిషనర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో చెరువులు, ప్రభుత్వ స్థలాలు, పార్కుల రక్షణకు హైడ్రా కమిషనర్ రంగనాద్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. హైడ్రా పేరుతో నగరంలో ఎంతో మార్పు వచ్చిందని, నగరాభివృద్ధికి మరిన్ని మార్పులు రావాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## ఉమామహేశ్వర స్వామి దేవాలయంలో జమ్మిచెట్టు పూజలు

**నిజాంపేట్, అక్టోబరు 13, ప్రభాతవార్త :** ఉమామహేశ్వర స్వామి దేవాలయం, శ్రీనల్లపోచమ్మ దేవస్థానం నందు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన జమ్మిచెట్టు పూజ, అమ్మవారి చీరల వేలంపాట, రావణ దహన, రాజీవ్ గృహకల్పలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో భాగంగా కమిటీ సభ్యులు, ఆలయ ప్రెసిడెంటన పితాని శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ సరాళ లక్ష్మణ్, ముఖ్య సలహాదారు రామ్ చంద్రనాయక్, ట్రెజరర్ వి.వి.రమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ శి, సలాడి శివ, బాలకృష్ణ, లక్ష్మణ్, ట్రెజరర్2 సరిత, విజయలక్ష్మీ, ఉష, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా దసరా ఉత్సవాలు

**మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబరు 13 ప్రభాతవార్త :** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో అత్యంత వైభవంగా దసరా ఉత్సవాలు జరిగాయి. పల్లె చెరువు, మధుబన్ కాలనీ ప్రాంతాలలో శ్రీ బలరామ కృష్ణ భక్త భజన మండలి ఆధ్వర్యంలో జరిగిన జమ్మి చెట్టు ప్రత్యేక పూజ, రావణ దహన కార్యక్రమంలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. కాగా పలు ప్రాంతాలలో ప్రజలు దసర పండుగను ఎంతో ఘనంగా జరుపుకున్నారు.



దసరా ఉత్సవాలలో పాల్గొన్న తోకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు



హరీష్‌రావుతో భేటి అయిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, పార్టీ నేతలు

## మాజీ మంత్రి హరీష్‌రావుతో ఉప్పల్ బిఆర్ఎస్ నేతల బేటి

**ఉప్పల్, అక్టోబరు 13 ప్రభాతవార్త :** మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావుతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు రాగిడి లక్ష్మారెడ్డి, పసుల ప్రభాకర్‌రెడ్డి, జెల్లి మోహన్, గుడి మధుసూధన్‌రెడ్డి, పిల్లి నాగరాజు, బి.కైలాసపతిగౌడ్, మంచికంటి రాజవర్ధన్‌గుప్త, కృష్ణగౌడ్, వీరేందర్, కృష్ణారెడ్డి, గడ్డం పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా ప్రతి ఒక్కరు ఆనందోత్సవాలతో పండుగ చేసుకోవాలని సూచించారు. దసరా పండుగ సందర్భంగా హరీష్‌రావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అలయ్,బలయ్

**ఉప్పల్, అక్టోబరు 13 ప్రభాతవార్త :** చిలుకానగర్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సోమవారం అలయ్, బలయ్ కార్యక్రమం నిర్వహించారు. చిలుకానగర్ మార్కండేయస్వామి ఆలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పలువురు పద్మశాలి సంఘం నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పద్మశాలి సంఘం నేతలు దాసరి కృష్ణ, గూడ శ్రీశైలం, సకినాల ప్రసాద్, దేవసాని బాలచందర్, వడ్డేపల్లి కిషోర్, బి.శ్రీనివాస్, పి.నర్సింగ్, బోడ విద్యాసాగర్, నాగార్జున, చందు, రమేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అలయ్, బలయ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రతి ఏటా ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

## మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

**ఉప్పల్, అక్టోబరు 13 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో దసరా పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా తరంగిణి నాట్య గురువు ఉమా మహేశ్వరి శిష్య బృందంచే కూచిపూడి నాట్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అంబపరాకు, రంగ పూజ, పుష్పాంజలి, బాలగోపాల, కల్యాణ రామ, దేవాదేం, భజే,జావలి, ఇదిగో పరమ పురుషుడు, జానకి, అన్నమయ్య కీర్తనలు, శివతాండవం, మంగళం అంశాలను కళాకారులు నీలిమ, మహతి, జాయి, శృతి, సమీక్ష, రియన్షిక, స్నిగ్ద, సాహితి, శ్రీలక్ష్మి, శావ్య, మల్లికా, యుక్తశ్రీ, లక్ష్మి ప్రసన్న, లక్ష్మి కారుణ్య తమ ప్రదర్శనలో ఆకట్టుకున్నారు. సోమవారం సెలవు దినం కావడంతో సందర్శకుల నుంచి మంచి స్పందన ఉందని నిర్వాహకులు తెలిపారు.

### చిక్కడపల్లి కోనసీమ ద్రావిడ సంఘం ఆధ్వర్యంలో

# దసర నవరాత్రి వేడుకలు

**చిక్కడపల్లి అక్టోబరు 13 ప్రభాతవార్త:**

చిక్కడపల్లి కోనసీమ ద్రావిడ సంఘం ఆధ్వర్యంలో దసర శరన్నవ రాత్రోత్సవాలను పురస్కరించుకుని విజయదశమి సందర్భంగా చండీహోమం కార్యక్రమం నేత్రపర్వంగా సాగింది. ఈ సందర్భంగా ప్రతిభకనబర్చిన విద్యార్థినీ విద్యార్థులకు మెరిట్ సర్టిఫికేట్లను, బంగారు పతకాలను అందించి ప్రోత్సహించారు. కార్యక్రమంలో వడ్లమాని బాలామణి, ఆధిభట్ల కామేశ్వరరావు, బండి శ్రీనివాస్, కందాళ భాస్కర రామచంద్ర, డిఎల్వీ.సత్యనారాయణ, కర్రా లక్ష్మినారాయణ, పేరి భీమశంకరం, మంథా నరసింహశాస్త్రి, దక్షిణామూర్తి, అనంతలక్ష్మి, మేనేజర్ త్రిమూర్తి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు, బంగారు పతకాలను అందించిన దృశ్యం

# ఉప్పల్ సర్కిల్‌లో ఘనంగా దసరా వేడుకలు

**ఉప్పల్, అక్టోబరు 13 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలో ఉప్పల్, రామంతాపూర్, హబ్సిగూడ, చిలుకానగర్ తదితర ప్రాంతాల్లో దసరా సమ్మేళనం వేడుకలను ప్రజలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ప్రజల ఆనందోత్సాహాల మధ్య టపాసులు కాల్చి దీపావళిని తలపించేలా దసరా పండుగను చేసుకున్నారు. చెడుపై మంచి విజయం సాధించడానికి ప్రతీకగా నిర్వహించే రావణ దహన కార్యక్రమాలు పలు ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. ఉప్పల్ మున్సిపల్ స్టేడియం, పెద్ద మసీదు, చిలుకానగర్, బీరప్పగడ్డ, రామంతాపూర్, హబ్సిగూడ తదితర ప్రాంతాల్లో దసరా ఉత్సవాల సందర్భంగా రావణ దహనం నిర్వహించారు. ఉప్పల్ మున్సిపల్ స్టేడియంలో దసరా ఉత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మందముల్ల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కార్పొరేటర్ మందముల్ల రజిత పరమేశ్వర్‌రెడ్డి, దుబ్బ నరసింహారెడ్డి, కందికంటి అశోక్‌గౌడ్, బజారు జగన్‌గౌడ్, పాండుగౌడ్, తెల్కల మోహన్‌రెడ్డి, పూజల ప్రభాకర్, బాకారం లక్ష్మణ్, చెన్‌రెడ్డి రఘుపతిరెడ్డి, బిక్కుమళ్ల అంజయ్య గుప్త తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రావణ దహనం, జమ్మి పూజ, పాలపిట్ట దర్శనం తదితర కార్యక్రమాలు ముఖ్య అతిధుల చేతుల మీదుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి నేతలు తౌఫిక్, ఈగ అంజయ్య, లుకాస్, రఫీక్, జలీల్‌పాషా, గొరిగె ఐలేష్, జన్ని రఘు, సోము జంగయ్య, అమరేశ్వరి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పెద్ద మసీదు వద్ద ఉత్సవ కమిటి నిర్వహకులు రెడ్డిగారి దేవేందర్‌రెడ్డి, చిందం వెంకటేష్, బోరంపేట రవి, తలారి జహంగీర్, తలారి విజయ్, వినయ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మాజీ మున్సిపల్ చైర్మన్ మేకల శివారెడ్డి, పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రతి ఏటా అంగరంగ వైభవంగా చేయడం హర్షనీయమన్నారు. ఉత్సవ సమితికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు. అదే విధంగా గణేష్‌నగర్ చౌరస్తాలో దసరా సమ్మేళనం ఘనంగా నిర్వహించారు.

**రామంతాపూర్‌లో...**

రామంతాపూర్ ప్రధాన రహదారిలో దసరా ఉత్సవ సమితి అధ్యక్షుడు బుర్ర రాజేశ్వర్, చైర్మన్ వల్లపు జగన్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్లు బండారు శ్రీవాణి, కక్కిరేణి చేతన తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఉత్సవాలకు తగు సహకారం అందిస్తున్నామని తెలిపారు. ఈసందర్భంగా రావణ దహనం, బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉత్సవ సమితి నేతలు పాల్గొన్నారు.

**చిలుకానగర్‌లో...**

చిలుకానగర్ చౌరస్తాలో దసరా ఉత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గోనె శ్రీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రావణ దహనం, జమ్మిపూజ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిలుకానగర్ గ్రామ పెద్దలు గోనె అంజయ్య, దేవసాని బాలచందర్, బూర్గుల రమేష్‌గౌడ్, కొంపల్లి బాలరాజు, పాల్వంచ విఠల్, ఆర్.బలరామ్, శామీర్‌పేట చంద్రయ్య, గోపాల్‌రెడ్డి, ఎద్దు బిక్షపతి, భరత్‌రెడ్డి, కొంపల్లి రవీందర్, స్వామి యాదవ్, తిరుపతి, సత్యనారాయణ, మల్లేశం, తుమ్మల రమేష్, మొట్టె పున్నంరాజ్, ఎం.విజయ్, కమిటి సభ్యులు సుధాకర్‌రెడ్డి, మడిపడిగ శ్రీనివాస్, పాల్మకుల సురేష్, దప్పు దత్తుసాయి, నరేష్, తోట సమ్మయ్య, వినయ్‌రెడ్డి, హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వేలంలో దుర్గామాత లడ్డూను పొందిన రావుల నర్సింహా

## దుర్గామాత లడ్డూ, పట్టుచీర, కలశానికి వేలాలు

### రూ.1.84 లక్షలు పలికిన లడ్డూ.. రూ.1.65 లక్షలు పలికిన పట్టుచీర

**సరూర్‌నగర్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివార్లలోని మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడ గ్రామంలో దుర్గామాత చేతిలో లడ్డూ వేలంలో రూ.1,84,444 పలికింది. అదే విధంగా అమ్మవారు ధరించిన పట్టు చీర రూ.1,65,500, పూజా కలశం రూ.43 వేలు పలికాయి. గణేష్ లడ్డూ వేలాల మాదిరిగానే ఈ గ్రామంలో దుర్గామాత లడ్డూను, చీరను వేలం వేయడం ఆచారంగా వస్తున్నది. ఈ క్రమంలో ఆదివారం దుర్గామాత నిమజ్జన ఊరేగింపు శోభాయాత్ర సందర్భంగా గ్రామ కూడలిలో వేలాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లడ్డూకు జరిగిన వేలంలో అందరి కంటే ఎక్కువ పాట పాడిన గ్రామస్తుడు రావుల నర్సింహా రూ.1,84,444లకు దక్కించుకోగా అమ్మవారి పట్టుచీరను జక్కిడి సురేందర్‌రెడ్డి రూ.1,65,500లకు, పూజా కలశాన్ని రూ.43 వేలకు పుట్టగళ్ళ రాజు కైవసం చేసుకున్నారు. వేలాల అనంతరం వేలం విజేతలను సన్మానించి వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు కొలను రాజవర్ధన్‌రెడ్డి, జక్కిడి గోవర్ధన్‌రెడ్డి, కొండా హేమంత్‌రెడ్డి, చిప్ప భాస్కర్, జక్కిడి సురేందర్‌రెడ్డి, గుండ్ల గణేష్, కొలను మహిపాల్‌రెడ్డి, గొరిగె జంగయ్య, దడిగె నాగేష్, జక్కిడి నరేందర్‌రెడ్డి, పల్లె సాయికిరణ్‌గౌడ్, సామ లక్ష్మారెడ్డిలతో పాటు గ్రామ, కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలి

**యూసుఫ్‌గూడ, అక్టోబరు 13, ప్రభాతవార్త :** దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీ వీరాంజనేయ భవాని శంకర అయ్యప్ప స్వామి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శనం పొందారు. శనివారం రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

## అమ్మవారికి ప్రత్యేక పూజలు

**యూసుఫ్‌గూడ, అక్టోబరు 13, ప్రభాతవార్త :** దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీ వివేనాంద నగర్‌లోని రోడ్డునెంబర్ 7లో స్వామి వివేకానంద సేవా సమితి అధ్యక్షులు గంగుమళ్ళ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో స్వామి వివేకానంద సేవా సమితి చైర్మన్ పులిగోళ్ళ శ్రీనువాస్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో పెండం శివరామ్, పప్పుల వెంకటమహేష్, సురేంద్ర, కేశవరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాబా మహాసమాధి ఉత్సవాలు

**సరూర్‌నగర్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రశాంతిహిల్స్‌లోనున్న ద్వారకామాయి సాయిబాబా పీఠంలో సాయిబాబా మహాసమాధి ఉత్సవాలు, విజయ దశమి పర్వదిన పూజలు ఘనంగా జరిగాయి. దసరా విజయ దశమి రోజే బాబా మహా సమాధి అయిన సందర్భంగా ప్రతి సంవత్సరం పీఠంలో కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా శనివారం పీఠాధిపతి అయిన శ్రీపాద శ్రీవల్లభుల వంశంలో 34వ తరానికి చెందిన దత్త సిద్ధాంత ఆదికర్త పూజ్యశ్రీ గోపాలకృష్ణానంద స్వామీజీ ఆధ్వర్యంలో బాబాకు ప్రత్యేక పూజలు, ఈశ్వరాభిషేకం, శ్రీచక్ర పూజలు, భజనలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాల్లో సినీ దర్శకుడు, నిర్మాత ఎంఆర్‌సి చౌదరి, జస్టిస్ చంద్రకుమార్, స్పెషల్ బ్రాంచి ఇన్స్‌పెక్టర్ సురేష్, మీర్‌పేట్ ఎస్ఐ సుధాకర్, పీఠం మాతాజీ మల్లాది విజయశ్రీ, బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్, బాబా భక్తులు ఎస్‌పి శాస్త్రి, విమల శాస్త్రి, చారి, రాధాకృష్ణ, సాయిలలిత్‌తోపాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

## కనుల పండువగా విజయదశమి వేడుకలు

**సరూర్‌నగర్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** విజయ దశమి పర్వదినం సందర్భంగా మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఓల్డ్ బాలాజీనగర్‌లో రావణ దహన కార్యక్రమం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీ కూడలిలో రావణ దహన కార్యక్రమాన్ని నిర్వహించి జై శ్రీరాం, జై దుర్గా భవానీ నినాదాలు చేశారు. అనంతరం నవరాత్రుల్లో అమ్మవారికి సేవలందించిన హరిణి, పరమేశ్వరి, కృష్ణవేణి, లక్ష్మి తదితరులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తిమ్మరాజు మధుసూదన్‌రావు, డాక్టర్ వెంకన్న, నాగేశ్వరచారి, అరుణ్ కుమార్, ఆంజనేయులు, మహేష్ గౌడ్, వంశీ (బిట్టు), రాంబాబు, సునీల్, కృష్ణ, పాండులతో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చారిత్రక మీర్‌పేట్ బురుజు వద్ద విజయ దశమి సంబరాలు

**సరూర్‌నగర్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మీర్‌పేట్ పాత గ్రామంలోనున్న చారిత్రక బురుజు వద్ద విజయ దశమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాషాయ ఓం జెండాను మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి స్వగ్రామానికి చెందిన నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మీర్‌పేట్ చౌరస్తాలోని కాశీ నర్మదేశ్వర స్వామి ఆలయం వద్ద రావణ దహనం జరిగింది. ఈ కార్యక్రమాల్లో మాజీ పోలీస్ పటేల్ స్వర్గీయ తీగల సత్యనారాయణరెడ్డి తనయుడు, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కార్పొరేటర్ కీసర గోవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పల్లె పాండుగౌడ్, తీగల నితీష్‌రెడ్డి, పల్లె జంగయ్యగౌడ్, కీసర శ్రీనివాస్‌రెడ్డి, కీసర సుధాకర్‌రెడ్డి, తీగల సాయినాథ్‌రెడ్డి, ఎడ్ల మల్లేష్ యాదవ్, పల్లె ఉమేష్‌గౌడ్, పెండ్యాల శ్రవణ్‌కుమార్, పెండ్యాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లెలగూడలో కనుల పండువగా రావణ దహనం

**సరూర్‌నగర్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** జిల్లెలగూడలోని చారిత్రక శ్రీ మత్స్యావతార వెంకటేశ్వర స్వామి ఆలయంలో రావణ దహన కార్యక్రమం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు, కాలనీవాసులు ఆలయ ఆవరణలో శమీ పూజను నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రావణ దహన కార్యక్రమాన్ని జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ మాజీ ధర్మకర్తలు బొమ్మరబోయిన యాదగిరి ముదిరాజ్, సిహెచ్ జ్ఞానేశ్వర్, కార్పొరేటర్లు బొక్క రాజేందర్‌రెడ్డి, పోరెడ్డి పద్మా భాస్కర్‌రెడ్డి, అర్కల భూపాల్‌రెడ్డి, ఎనుగుల అనిల్ యాదవ్, నాయకులు అర్కల కామేష్‌రెడ్డి, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, అర్చకులు డింగరి రామాచారి, రాఘవాచారిలతో పాటు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## చిలుకానగర్‌లో హరిహర క్షేత్రం మూలవిరాట్ శంకుస్థాపన

**ఉప్పల్, అక్టోబరు 13 ప్రభాతవార్త :** చిలుకానగర్‌లో అధునాతన హంగులతో నిర్మిస్తున్న శ్రీ చిలుకేశ్వర అంజనేయస్వామి దేవాలయం (హరి హర క్షేత్రం) మూల విరాట్ శంకుస్థాపన, ఉపాలయాల యంత్ర ప్రతిష్ట కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటి అధ్యక్షుడు దాసరి కృష్ణ, ఉపాధ్యక్షుడు బూర్గుల రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి గోనె శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మేకల శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ శ్రీ చిలుకేశ్వర అంజనేయస్వామి ఆలయ పునఃప్రతిష్టాపనకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని కోరారు. ఆలయంలో భక్తులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా మూల విరాట్ ఆలయానికి శంకుస్థాపన, ఉపాలయాల యంత్ర ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి నేతలు దేవసాని బాలచందర్, జెల్లి మోహన్, అడెపు అంజయ్య, శామీర్‌పేట చంద్రయ్య, ఆర్.బలరామ్, మాస శేఖర్, జిల్లాల ప్రవీణ్, సంఘీ స్వామియాదవ్, గౌరయ్య, తెలంగాణ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## అష్టలక్ష్మి దేవాలయం వద్ద రావణ దహనం

**ఎల్.బి.నగర్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** ఆర్కేపురం డివిజన్ వాసవి కాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో విజయదశమి పర్వదినం సందర్భంగా అమ్మవారి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శరన్నవరాత్రి ముగింపు సందర్భంగా దేవాలయం ఆవరణలో భారీగా ఏర్పాటు చేసిన రావణుడిని దేవాలయం ప్రధాన అర్చకుడు దగ్ధం చేశారు. కార్యక్రమాన్ని తిలకించడానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.



సిఎంకు దసరా శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే తదితరులు

## సిఎంకు దసరా శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

**కంటోన్మెంట్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** దసరా పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్‌లను కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ శని వారం సిఎం క్యాంప్ ఆఫీస్‌లో కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు సుఖసంతోషాలతో ఆరోగ్యంగా జీవించాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి దసరా వేడుకల్లో తనకు అవకాశం దక్కడం అభినందనీయని ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు.

## తుకారాంగేట్‌లో ఘనంగా దసరా వేడుకలు

**అడ్డగుట్ట, అక్టోబరు 13 ప్రభాతవార్త:** అడ్డగుట్ట డివిజన్ తుకారాంగేట్ లోని శ్రీపహాడి హన్‌మాన్ దేవాలయంలో శనివారం రాత్రి దసరా వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ డెవలప్‌మెంట్ కమిటీ ప్రతినిధులు నక్క మధు, ఆదం విజయ్‌కుమార్, కాసుల సుదర్శన్‌రెడ్డి, ఆర్.శ్రీరాములు, పి.క్రిష్ణ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా, బతుకమ్మ వేడుకలకు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్, అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్నశ్రీనివాస్, ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ కుమారుడు రామేశ్వర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ ఆదం విజయ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై రావణ దహనం చేశారు. ఈ సందర్భంగా మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి దసరా వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు పి.క్రిష్ణ, శివకుమార్, విజయ్‌కుమార్, రమేశ్ బాబు, నర్సింగ్, ఆర్.మల్లేశ్, శివశంకర్, దేవయ్య పాల్గొన్నారు.

## ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి : ఎమ్మెల్యేలు

**కంటోన్మెంట్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో ఆరోగ్యంగా జీవించాలని భగవంతుడిని వేడుకున్నట్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్.మల్లారెడ్డి తెలిపారు. శని వారం బోయిన్‌పల్లి కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్‌లో నిర్వహించిన దసరా వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, ప్రముఖ పారిశ్రామిక వేత్త సామల రాఘవరెడ్డి, ఎం.ఎల్. ఆర్ఐటి విద్యా సంస్థల అధిపతి మర్రి లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## దసరా వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్

**కంటోన్మెంట్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** గ్రేటర్, మోండా డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో శనివారం, ఆదివారాల్లో నిర్వహించిన దసరా వేడుకలకు మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక, ఎమ్మెల్యేలు ఎన్.శ్రీగణేష్, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లు వేరు వేర్వేర్‌గా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపికతో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## హరీశ్‌రావుకు దసరా శుభాకాంక్షలు తెలిపిన నాగేశ్



హరీశ్‌రావుకు దసరా శుభాకాంక్షలు తెలుపుతున్న గజ్జెల నాగేశ్

**కంటోన్మెంట్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** దసరా పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం బేవరేజెస్ మాజీ కార్పొరేషన్ చైర్మన్, కంటోన్మెంట్ తెలంగాణ ఉద్యమ నేత గజ్జెల నాగేశ్ మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు దాసోజ్ శ్రావణ్, రావుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## పూజలు చేస్తున్న భజరంగ్‌సేనా ప్రతినిధులు




పూజలు చేస్తున్న భజరంగ్‌సేనా అధ్యక్షులు లక్ష్మన్‌రావుగుప్త

**బేగంబజార్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** విజయ దశమిని పురస్కరించుకుని తెలంగాణ భజరంగ్ సేనా ఆధ్వర్యంలో కార్యాలయంలో అమ్మవారి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భజరంగ్‌సేనా అధ్యక్షులు ఎన్.ఆర్. లక్ష్మన్‌రావుగుప్త, ప్రతినిధులు వినయ్‌తివారి, సంజయ్‌కుమార్, మనోజ్ మొగలిడి, అభినవ్‌తివారి, కె.రాఘువ, నరేష్, బాలాజీ హివారి, తరణ్ జిత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విజయదశమి

**బేగంబజార్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** గోషామహల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో విజయదశమి పూజలను ఘనంగా నిర్వహించారు. శనివారం విజయదశమి సందర్భంగా వివిధ ప్రాంతాలలో నిర్వాహకులు ప్రతిష్టించిన దుర్గామాత విగ్రహాలకు భక్తులు భక్తిశ్రద్దలతో పూజలు చేశారు. పలు ఆలయాలు భక్తుల రద్దీతో కిటకిటలాయి. బేగంబజార్, గౌలిగూడ, గోషామహల్, చాక్నవాడి ప్రాంతాలలోపాటు పురానాపూల్, ఎస్.వి.నగర్, భవానీనగర్, గొల్లకిడికి ప్రాంతాల్లో ప్రజలు ఎంతో భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. పురానాపూల్ ఎస్.వి.నగర్ అమ్మవారి ద్వారం వద్ద నెలకొల్పిన మండపంలో అమ్మవారికి కామాటిపురా ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్‌తోపాటు ఎస్.ఐలు సురేందర్, రవీందర్ ప్రత్యేకపూజలు చేశారు.

## శ్రీసాయిబాబా ఆలయంలో లక్ష పుష్పార్చన

**బేగంపేట అక్టోబరు 13, ప్రభాతవార్త :** సికింద్రాబాద్ మినిస్టర్ రోడ్డులోని శ్రీసాయిబాబా ఆలయంలో 106వ మహా సమాధి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం లక్ష పుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజల్లో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. శ్రీసాయిబాబాకు పూజలు నిర్వహించారు. పుష్పాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేసారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ గావించారు.



మినిస్టర్ రోడ్డు శ్రీసాయిబాబా ఆలయంలో లక్ష పుష్పార్చన.

## శ్రీరాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు



శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకారంలో అమ్మవారి దర్శనం

**నాంపల్లి, అక్టోబరు 13 ప్రభాతవార్త :** రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ నిర్వహణ గాంధీనగర్ ఎస్‌బిహెచ్ కాలనీ వద్దనున్న అతి పురాతన మహాన్విత శ్రీసంగమేశ్వరస్వామి, శ్రీవేంకటేశ్వరస్వామి వార్ల దేవాలయంలో శ్రీదేవి శరన్నవ రాత్రోత్సవాల్లో చివరిరోజు అమ్మవారు శ్రీరాజ రాజేశ్వరీదేవి అలంకారంలో భక్తకోటికి దర్శనమిచ్చారు. అకిలాండకోటి బ్రహ్మాండ నాయకురాలైన పార్వతి దేవి అమ్మవారికి శరన్నవరాత్రోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరిగిన శరన్నవరాత్రోత్సవాల పూజల్లో ఆలయ అర్చకస్వాములు ఎం.చంద్రశేఖరశర్మ- ప్రధాన అర్చకులు, కె.ప్రవీణ్‌కుమార్- పరిచారిక; అర్చకులు కె.మురళీకృష్ణమాచారి; టి.చంద్రశేఖర్ తదితరులు ప్రతీరోజూ ఉదయం 5గంటల నుండి అమ్మవారి అభిషేకం; ఉదయం 9లకు అమ్మవారి అలంకార దర్శనము; ఉదయం 10లకు హవనము, లఘు పూర్ణాహుతి, మహానివేదన; మధ్యాహ్నం 12 గంటలకు మంగళహారతి, మంత్రపుష్పము, తీర్థ ప్రసాద వితరణ; రాత్రి 6.30 గంటల నుండి శ్రీ లలితా సహస్రనామార్చన, నివేదన, మంగళహారతి, మంత్రపుష్పము, తీర్థప్రసాద వితరణలు శాస్త్రోక్తంగా కావించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లక్ష్మారెడ్డి వివరించారు. నవరాత్రోత్సవాలు ఆఖరిరోజు 12 శనివారం అమ్మవారు శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకారంతోపాటు విజయదశమిని పురస్కరించుకొని ఉదయం 9లకు మహాపూర్ణాహుతి, రాత్రి 6 గంటలకు శమీపూజ ఇత్యాధికార్యక్రమాల్లో వందలాదిమంది భక్తజనులు పాల్గొని ఒకరికొకరు దసరా శుభాకాంక్షలు తెలుపుకొంటూ సంప్రదాయబద్ధంగా అలయ్‌బలయ్‌తో భిన్నత్వంలో ఏకత్వం నిరూపించారు. ఈ శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలను ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లక్ష్మారెడ్డి దగ్గరుండి పర్యవేక్షించి దిగ్విజయం కావించారు.



పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న పావనీ వినయకుమార్

## పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

**చిక్కడపల్లి, అక్టోబరు 13 ప్రభాతవార్త:** పారిశుధ్య కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రోత్సాహం ఎంతో అవసరమని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ అన్నారు. ఆదివారం గాంధీనగర్ డివిజన్‌లో జవహర్‌నగర్ కమ్యునిటీ హాల్‌లో దసరా కానుకగా జిహెచ్‌ఎంసి పారిశుధ్య కార్మికులకు, ఎస్‌ఎఫ్‌ఏలకు దుస్తులు, చీరలను పంపిణీ చేసే కార్యక్రమం జరిగింది. జిహెచ్‌ఎంసిలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో ఉందని, నిత్యం దుమ్ము, దూళి, చెత్తా చెదారంనుంచి తొలగించి ప్రాంతాలను అందంగా, అపరిశుభ్ర వాతావరణం లేకుండా చేయడంతో వారి పాత్ర ఎంతో ఉందన్నారు. ఇటువంటి కార్మికులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా తగిన విధంగా చర్యలు తీసుకుంటామని, ఆరోగ్యపరమైన ఇబ్బందులు వారు పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్, డివిజన్ బిజెపి అధ్యక్షుడు రత్నాసాయిచంద్, బిజెపి నేతలు శ్రీకాంత్, ఉమేశ్, సత్తిరెడ్డి, ఆకుల సురేందర్, ప్రకాశ్‌యాదవ్, ఆనంద్‌రావు, అరుణ్‌కుమార్, జ్ఞానేశ్వర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పాతబస్తీలో రావణ దహనం

**చార్మినార్, అక్టోబరు 13 ప్రభాతవార్త :** దసరా పండుగ సందర్భంగా హైదరాబాద్ పాతబస్తీ కులీకుతుబ్ షా స్టేడియంలో శనివారం రాత్రి హిందూ సంరక్షణ సమితి భాగ్యనగర్ అధ్యక్షులు ఫంకజ్ కుమార్ ఆధ్వర్యంలో రావణ దహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో హై కోర్టు న్యాయమూర్తి సురేపల్లి నందా, రాష్ట్ర స్వయం సేవక్ సంఘ్ భాగ్యనగర్ ప్రచారక్ శ్రీ రామ కుమార్, ఉదాసీనా మఠం అధిపతి అరుణ్ దాస్ మహరాజ్ మహంతి, బిజెపి నాయకులు మెఘరాణి అగర్వాల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

### గౌలిపురలో వైభవంగా దసరా ఉత్సవాలు

పాతబస్తీ గౌలిపురలోని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయం కమిటి అధ్వర్యంలో వైభవంగా దసర ఉత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో దక్షిణ మండలం డిసిపి స్నేహ మెహ్రా, ఛత్రినాక సిఐ శ్రీనివాస్ రెడ్డి, ఆలయం కమిటి చైర్మన్ శేషాద్రి అయ్యంగార్, ట్రస్టీ సుందర్ అయ్యంగార్, ప్రధాన కార్యదర్శి ఎస్.పి.క్రాంతి కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## గవర్నర్ దత్తాత్రేయ అలయ్ బలయ్‌కు షాద్‌నగర్ నేతలు

**షాద్‌నగర్, అక్టోబరు 13 ప్రభాతవార్త :** హర్యానా రాష్ట్ర గవర్నర్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో షాద్‌నగర్‌కు చెందిన బీజేపీ నేతలు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్యలు పాల్గొన్నారు. అనేక సంవత్సరాలుగా దత్తాత్రేయ అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ భిన్నమైన పార్టీ నాయకులను, విభిన్నమైన సిద్ధాంతాలు కలిగిన వారిని ఒకే వేదిక మీదకి తీసుకువచ్చి రాయకీయాలలో నూతన సాంప్రదాయాలను సృష్టించారని వారు తెలిపారు. తెలంగాణ ఉద్యమ కాలంలో ఏర్పడ్డ జేఏసీకి ఈ సాంప్రదాయం స్ఫూర్తి అని వివరించారు. అనంతరం దత్తాత్రేయ వారిని సన్మానించి స్వాగతించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

## గిరిజనుల సాంప్రదాయాలకు ప్రతీక ముత్యాలమ్మ పండుగ

**కేశంపేట, అక్టోబరు 13, ప్రభాతవార్త:** గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాలకు ఆచారాలు నమ్మకాలను ప్రతిబింబించే ప్రత్యేక పడుగ ముత్యాలమ్మ పండు అని సింగిల్ విండో డైరెక్టర్ రాజమోని మధుసూదన్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామపంచాయతీ సచివాలయంలోని బాల్యతండాలో గిరిజనుల సాంద్రాయ పండుగ అయిన ముత్యాలమ్మ పండుగ వేడుకల్లో ముఖ్య అతిధిగా మధుసూదన్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సమాజంలో ముత్యాలమ్మను ఒక శక్తి రూపమైన గ్రామ దేవతగా పూజిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మాడమోని శేఖర్‌గౌడ్, తండావాసులు పాల్గొన్నారు.

## కండీషన్‌లో లేని బస్సులతో పరేషాన్..!

**షాద్‌నగర్, అక్టోబరు 13, ప్రభాతవార్త :** కండీషన్‌లో లేని బస్సులతో షాద్‌నగర్ ప్రయాణీకులు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ బస్‌డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు టీఎస్ 06 జెడ్ 0166 ప్రయాణీకులతో హైదరాబాద్‌కు బయల్దేరింది. కానీ మార్గమధ్యంలో మదనపల్లి వద్ద సాంకేతిక కారణాలతో బస్సు ఆగిపోయింది. దీంతో వివిధ పనుల నిమిత్తం, ఉద్యోగాల నిమిత్తం వెళ్లున్న ప్రయాణీకులు నడిరోడ్డుపై ఆగిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్టీసీ కండక్టర్ ప్రయాణీకులకు ఇచ్చిన టికెట్టుపై టీఎస్ 29 జెడ్ 0020 నెంబరు ఉండగా ప్రయాణీకులను తీసుకెళ్లిన బస్సు నెంబరు మాత్రం టీఎస్ 06 జెడ్ 0166 ఉండడంతో ప్రయాణీకులు పలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. కండీషన్‌లో లేని బస్సులను పంపించి ఇబ్బందులకు గురి చేయడమేమిటని ప్రయాణీకులు ఆర్టీసీ అధికారులను ప్రశ్నిస్తున్నారు. బస్సుల నిర్వహణ సరిగ్గా లేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని ప్రయాణీకులు వాపోయారు. కండీషన్‌లో ఉన్న బస్సులను మాత్రమే ఆయా రూట్లలో నడిపించాలని ఆర్టీసీని కోరారు.

## టీకాతో మెనింజైటిస్ నివారించవచ్చు

-డాక్టర్ పవన్‌కుమార్

**చిక్కడపల్లి, అక్టోబరు 13 ప్రభాతవార్త:** తీవ్రమైన నివబ్ధ ముప్పుగా పరిణమిస్తున్నప్పటికీ టీకా ద్వారా చాలా వరకు మెనింజైటిస్ నివారించవచ్చని ప్రముఖ వైద్యులు, పీడియాట్రిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ కె.పవన్‌కుమార్ అన్నారు. 'నిశ్శబ్ద హెచ్చరిక మొదలు ప్రాణాలను కాపాడే పరిష్కారం వరకు-మెనింజైటిస్ నివారణలో వ్యాక్సినేషన్‌పాత్ర' అనేఅంశంపై ఆదివారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ పవన్‌కుమార్ మాట్లాడారు. ఈ అంటు వ్యాధి నుంచి మన సమాజాన్ని, ముఖ్యంగా పిల్లలకు రక్షణ కల్పించడంలో రోగనిరోధక ప్రభావాన్ని నివారించుకోవచ్చన్నారు. ఇండియన్ అకాడమి ఆఫ్ పీడియాట్రిక్స్(ఐఏపి) తొమ్మిది నెలల నుంచి 23 నెలల వయస్సు గల శిశులు మెనింగోకాకల్ టీకా రెండు డోసులను కనీసం మూడు నెలల వ్యవధిలో స్వీకరించాలని సిఫార్సులు చేయడం జరిగిందని, రెండు 55 సంవత్సరాల వయస్సు గల వ్యక్తులు ఒకే మోతాదులో పొందాల్సి ఉంటుందన్నారు. టీకా అనేది అత్యంత నమ్మదగిన రక్షణ పద్ధతి అని, ఇన్‌ఫెక్షన్‌కు వ్యతిరేకంగా అవసరమైన రక్షణను అందిస్తుందని, అనారోగ్యాన్ని నివారించడమే కాకుండా రాబోయే తరాల ఆరోగ్య, భవిష్యత్తు శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని కాపాడుతుందన్నారు.

## ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

-ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్



కార్యక్రమంలో పాల్గొన్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

**చిక్కడపల్లి, అక్టోబరు 13 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ఆదివారం గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన కెఎం వైద్యశాలను బిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహాతో కలిసి ఎమ్మెల్యే ముఠాగోపాల్ లాంఛనంగా ప్రారంభించి ప్రసంగించారు. ఉరుకుల పరుగుల జీవితంలో చాలా మంది తెలియకుండా వివిధ రకాల రోగాలబారినపడి ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి తరుణంలో తక్షణ ఆరోగ్య సమస్యలపై అవగాహన ఎంతో అవసరమనాన్నారు. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు తదితర సమస్యలపై ఎప్పటికప్పుడు పరీక్షలను చేయించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ప్రముఖ వైద్యురాలు, యూరాలజిస్ట్ డాక్టర్ జానకీ, లక్ష్మీనారాయణ, డాక్టర్ అజయ్ బి.మోసూరి, బిఆర్ఎస్ నేతలు రాకేశ్, గజానంద్ తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు

**షాద్‌నగర్, అక్టోబరు 13, ప్రభాతవార్త :** సనాతన ధర్మాని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు అన్నారు. దసరా పండగను పురస్కరించుకొని ఐజా గ్రామంలోని శ్రీ స్వయంభూ కట్టకింది తిమ్మప్ప (శ్రీవెంకటేశ్వర స్వామి) దేవాలయాన్ని ఆయన సందర్శించినట్లు తెలిపారు. స్వామి వారికి దసరా పండగ సందర్భంగా పట్టు వస్త్రాలను పురోహితులకు అందజేసినట్లు పేర్కొన్నారు. 2012లో ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వస్తున్న మీ కోసం పాదయాత్రలో భాగంగా ఆలయాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనాడు దసరా ఉత్సవాల్లో పాల్గొన్నారని, ఆ తర్వాత టీడీపీ ప్రభుత్వ హయాంలో 35 లక్షల రూపాయలతో టీటీడీ కళ్యాణ మండపాన్ని నిర్మించినట్లు గుర్తుచేశారు. 2012 తర్వాత ప్రతి ఏటా ఈ ఆలయాన్ని దర్శించుకుంటున్నట్లు బక్కని నర్సింహులు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు సుధాకర్ గౌడ్, దేవస్థానం కమిటీ సభ్యులు మేకల శ్రీను, పాగుంట నర్సింహులు, తెలుగు నర్సింహులు, షెడ్రెకు, భీమన్న, శేఖర్, ఆలయ ధర్మకర్తలు, పూజారులు దేవాలయ అభివృద్ధి కోసం మరో 50 లక్షల రూపాయలను అందించాలని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ద్వారా చంద్రబాబు నాయుడిని కోరారు.

## మహిషాసురమర్ధినిని దర్శించుకున్న భక్తులు

**మొయినాబాద్ అక్టోబరు 12, ప్రభాతవార్త :** దసరా సందర్భంగా ఏర్పాటు చేసిన దుర్గమా త చివరి రోజు మహిషాసుర వర్ధిని అవతారాన్ని దర్శించుకున్న చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ పామేన భీమ్‌భరత్, సిఐ పవన్‌కుమార్‌రెడ్డి దర్శించుకున్నారు, మండలంలోని మొయినాబాద్ పంచాయితీలో ఉన్న గుల్షన్ కాలనీలో, కాలనీ అసోసియేషన్ వారు నవరాత్రుల్లో భాగంగా దుర్గామాత మండపాన్ని ఏర్పాటుచేశారు, ఎనిమిది రోజులు భక్తులతో పూజలందుకున్న అమ్మ వారు, చివరిరోజు మహిషా సుర వర్ధిని అవతారం కావ డంతో భక్తులు పోటెత్తి అమ్మవారిని దర్శించుకున్నారు,

## ముగిసిన శరన్నవరాత్రి వేడుకలు

**ఎల్.బి.నగర్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా విజయదశమి(దసరా) పర్వదినం సందర్భంగా శ్రీరామకృష్ణాపురం డివిజన్‌లోని కుర్తాళం శ్రీసిద్దేశ్వరి పీఠ విభాగ ఆదిపరాశక్తి శ్రీప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు దేవాలయం సెక్రెటరీ మునిపల్లి శ్రీనివాసరావు నేతృత్వంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. శ్రీరామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ కార్పొరేటర్ పున్న నిర్మలాగణేష్‌నేత, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్‌రావ్, పుష్పలత, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్ఎస్‌యుఐ శివ, అరుణ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం సెక్రటరీ శ్రీనివాస రావు వారిని శాలువాతో సత్కరించారు.

### సత్యనారాయణస్వామి దేవాలయంలో...

**ఎల్.బి.నగర్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** గడ్డిఅన్నారం డివిజన్లోని శ్రీవీరవెంకటసత్యనారాయణస్వామి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిరోజు అమ్మవారు ఒక అలంకరణతో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు.

## దుర్గమ్మకు కార్పొరేటర్ ప్రత్యేక పూజలు

**ఎల్.బి.నగర్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** కొత్తపేట గ్రామంలో శ్రీప్రసన్న మహాకాళి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ దుర్గామాతకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కార్పొరేటర్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వజీర్ ప్రకాష్‌గౌడ్, వాసుగుప్తా, తోట మహేందర్‌యాదవ్, కొప్పుల మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## అమ్మవారికి ఉప్పల దంపతుల పూజలు

**ఎల్.బి.నగర్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** నాగోల్‌గ్రామంలోని శ్రీమహంకాళి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. దేవాలయంలో నిర్వహిస్తున్న అమ్మవారి పూజా కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రచార కమిటీ కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త దంపతులు పాల్గొని విజయదశమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం నిర్వాహకులు ఉప్పల దంపతులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో దేవాలయం ప్రతినిధులు కందికంటి కన్నాగౌడ్, ప్రదీప్, ఉమామహేశ్వర్‌గుప్తా, సత్యనారాయణ, రాజుగౌడ్ పాల్గొన్నారు.

## హరిపురి కాలనీలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**ఎల్.బి.నగర్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** ఆర్కేపురం డివిజన్ హరిపూరి కాలనీలో బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా నిర్వహించారు. కాలనీలోని వందలాది మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మలు తీసుకువచ్చి ఆటలు ఆడారు, పాటలు పాడారు. కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం ప్రధానకార్యదర్శి పటేల్‌సునీతరెడ్డి, కాలనీ అధ్యక్షురాలు సుకన్య, ప్రధానకార్యదర్శి వాణి, శోభ, స్వప్న, అనిత, సక్కుబాయి, పద్మ, సుజాత, రాజ్యలక్ష్మి, స్వప్న పాల్గొన్నారు.

## ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

సిఐ పిడమర్తి నరేష్

**మలక్‌పేట, అక్టోబరు 13 ప్రభాతవార్త:** ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ పేర్కొన్నారు. దిల్‌షుక్‌నగర్ గడ్డిఅన్నారం శ్రీదుర్గామాత యూత్ అసోసియేషన్ నిర్వాహకులు లింగాల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు లింగాల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ నరేష్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ నరేష్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు కలిసి మెలిసి ఉత్సవాలను జరుపుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, బాబుగౌడ్, యాదిగౌడ్, పాషాభాయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విజయదశమి వేడుకలు

**మలక్‌పేట, అక్టోబరు 13 ప్రభాతవార్త:** మూసారాంబాగ్ విద్యుత్ కార్యాలయంలో ఏఈ ప్రీతి ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యుత్ కార్యాలయంలో ఉద్యోగులు ,సిబ్బంది భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయుధ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విద్యుత్ కార్యాలయంలో విజయ దశమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని, ప్రస్తుతం కూడా పెద్దఎత్తున విజయదశమి వేడుకలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. పండుగలు తెలంగాణ సాంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడి రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వాలియానాయక్ పాల్గొన్నారు.

శాసన మండలి ప్రతి పక్ష నాయకులు,ఎమ్మెల్సీ

## మధుసూదనాచారిని కలిసిన బిఆర్ఎస్ నాయకులు

**చార్మినార్, అక్టోబరు 13 ప్రభాతవార్త :** రాష్ట్ర శాసన మండలి ప్రతి పక్ష నేతగా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్సీ సి.మధుసూధనా చారిని ఆదివారం బహదూర్‌పుర నియోజకవర్గం బిఆర్ఎస్ అధ్యక్షులు సాయి కిరణ్‌తో పాటు పలువురు బిఆర్ఎస్ నాయకులు కలిసి పుష్ప గుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియేశారు. ఈ సందర్భంగా సాయి కిరణ్ మాట్లాడుతూ బిఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. పలువురు బిఆర్ఎస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో శరన్నవ రాత్రి ఉత్సవాలు

డిసిపి స్నేహ మెహ్రా

**చార్మినార్, అక్టోబరు 13 ప్రభాతవార్త :** శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలు జరుపుకున్నారని దక్షిణ మండలం డిసిపి స్నేహ మెహ్రా అన్నారు. పాతబస్తీ కులీ కుతుబ్‌షా స్టేడియంలో శనివారం రాత్రి జరిగిన బెంగాలీ శ్రీ దుర్గా మాత ఉత్సవాలలో డిసిని స్నేహ మెహ్రా పాల్గొన్నారు. తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షులు దీపాంకర్ పాల్, సమితి ప్రతినిధి మైధూస్‌లు కలిసి డిసిపి స్నేహ మెహ్రాను సత్కరించి శ్రీ దుర్గామాత విగ్రహాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా డిసిపి స్నేహ మెహ్రా మాట్లాడుతూ పాతబస్తీలో ప్రశాంతమైన వాతావరణంలో శ్రీ దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు జరిగాయని తెలిపారు. కార్యక్రమంలో వందలాది మంది బెంగాలీలు పాల్గొన్నారు.

# భార్యను హత్య చేసిన భర్త..!

**ఎల్.బి.నగర్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** భార్యాభర్తల మధ్య తరచూ జరుగుతున్న గొడవ హత్యకు దారితీసింది. ఈ సంఘటన సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ప్రకాశం జిల్లా కు చెందిన గుంజి సోను(32), గుంజి వెంకటేష్ కూలీ పనుల కోసం నగరానికి వచ్చి సరూర్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధి సరస్వతి నగర్‌లో నివాసం ఉంటున్నారు. భర్త వెంకటేష్ మే'గా, భార్య సోను ఇండ్లల్లో పని మనిషిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. భార్యభర్తల నడుమ మూడు సంవత్సరాల నుండి తరచు గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో వివాదాల పరిష్కారం కోసం పంచాయతీలు కూడా జరిగాయి. కాగా ఆదివారం ఇంట్లో ఇద్దరి మధ్య మాట మాట పెరిగి గొడవ పెద్దదయింది. అయితే భార్య పంజాబీ డ్రెస్ కు సంబంధించిన విషయంలో జరిగిన గొడవలో ఆవేశంతో భార్యను భర్త కత్తితో పొడిచి హత్య చేశాడు. వెంకటేష్ కత్తితో పొడవడంతో భార్య సోను అక్కడికక్కడే మృతి చెందింది. ఇద్దరు మధ్య జరిగిన పెనుగులాటలో భర్త వెంకటేష్ కు కూడా గాయాలు కావడంతో వైద్య చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. సరూర్ నగర్ పోలీసులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. హత్యకు సంబంధించిన కారణాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**IN THE COURT OF THE I JUNIOUR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT : SEC'BAD.**
**O.S.NO. 804 / 2024**
BETWEEN:
**A. HARENDER REDDY & ANOTHER ...PLAINTIFFS**
AND
**THE TAHASILDAR, MRO OFFICE SECUNDERABAD & OTHERS ...DEFENDANTS**
TO
**ALL CONCERNED ...DEFENDANT NO.2**
Whereas the above named Plaintiffs have filed above suit for declaration of Legal Heirs. You are hereby summoned to appear in this court in person or by a pleader on **05-11-2024 at 10.30 'O' clock**, failing which the matter will be heard and determined in your absence as exparte.
(BY ORDER OF THE COURT)
**M/s. Dr. P. NAGESH**
**Smt. P. PUSHPAMALA**
**P. RAJESHWARA RAO**
**B. SHANKER**
**B. RAMCHANDER RAO**
**N. NAVODAYA**
**Advocates**
O/o H.No.1-34, 'A' Block, S-213, Green Gold Apts, MALKAJGIRI, HYD-47.
**Cell: 9394755591**

**IN THE COURT OF THE I JUNIOUR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT : SEC'BAD.**
**O.S.NO. 802 / 2024**
BETWEEN:
**A. JAYALAXMI ...PLAINTIFFS**
AND
**THE TAHASILDAR, MRO OFFICE SECUNDERABAD & OTHERS ...DEFENDANTS**
TO
**ALL CONCERNED ...DEFENDANT NO.2**
Whereas the above named Plaintiffs have filed above suit for declaration of Legal Heirs. You are hereby summoned to appear in this court in person or by a pleader on **05-11-2024 at 10.30 'O' clock**, failing which the matter will be heard and determined in your absence as exparte.
(BY ORDER OF THE COURT)
**M/s. Dr. P. NAGESH**
**Smt. P. PUSHPAMALA**
**P. RAJESHWARA RAO**
**B. SHANKER**
**B. RAMCHANDER RAO**
**N. NAVODAYA**
**Advocates**
O/o H.No.1-34, 'A' Block, S-213, Green Gold Apts, MALKAJGIRI, HYD-47.
**Cell: 9394755591**

**PUBLIC NOTICE**
**IN THE COURT OF THE VII JUNIOR CIVIL JUDGE :: C.C.C. :: HYDERABAD**
**O.S.No. 1017 OF 2024**
BETWEEN
**State Bank of India,** PBB Amberpet Branch, Shivam Road, Hyderabad **...Plaintiff**
And
**Mrs. Ch. Swapna**
R/o. H.No.3-13-492, Bharat Nagar, L.B.Nagar, Hyderabad-500034 **...Defendant**
* * *
To,
**Mrs. Ch. Swapna**
R/o. H.No.3-13-492, Bharat Nagar, L.B.Nagar, Hyderabad-500034 **...Defendant**
Please take Notice that, the Plaintiff has filed the O.S.No. 1017/2024 against you before the above said Hon'ble Court for recovery of loan amount of **Rs.4,76,838/-** along with future interest etc... This Hon'ble Court posted the above suit on **22-10-2024** for your appearance. Hence, you are hereby summoned to appear before the above said Hon'ble court in person or through Advocate on the **22-10-2024 at 10.30 A.M.** In default of your appearance on the day afore mentioned, the Hon'ble court will be passed Exparte orders and determined in your absence.
//BY ORDER OF THE COURT//
**Sd/- A.V.S. RAMAKRISHNA**
**Advocate for Plaintiff**
5-34, Durga Nagar
Dilsukh Nagar, Hyderabad



శామీర్‌పేట సొసైటీని సందర్శించిన విదేశీ ప్రతినిధుల బృందం,పాల్గొన్న ఎన్ఎఎఫ్ఎస్‌సిఓబి చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, వివరిస్తున్న సొసైటీ చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి

## శామీర్‌పేటలో విదేశీ ప్రతినిధుల బృందం

**శామీర్‌పేట, అక్టోబరు 13, ప్రభాతవార్త**

శామీర్‌పేట వ్యవసాయదారుల సేవా సహకార సంఘం (సొసైటీని)ను విదేశీ ప్రతినిధుల బృందం సందర్శించింది. ఆదివారం శామీర్‌పేటలోని వ్యవసాయదారుల సేవా సహకార సంఘం పనితీరును రైతులకు అందుతున్న ప్రయోజనాలను తెలుసుకోవటానికి హోండురస్ సెంట్రల్ అమెరికా నుంచి 40మంది ప్రతినిధుల బృందం విచ్చేశారు. దేశంలోని మహారాష్ట్రలోని ముంబాయి, పశ్చిమబెంగాల్‌లోని కలకత్తాలో వారు పర్యటించారు. అదే విధంగ తెలంగాణంలోని శామీర్‌పేట వ్యవసాయదారుల సేవా సహకార సంఘాన్ని వారు సందర్శించారు. వీరి వెంట ఎన్ఎఎఫ్ఎస్‌సిఓబి చైర్మన్ కొండూరు రవీందర్‌రావు పాల్గొని రాష్ట్రంలోని వ్యవసాయదారుల సేవా సహకార సంఘాల అభివృద్ధి గురించి ప్రతినిధులకు వివరించారు. ఆ తరువాత శామీర్‌పేట సొసైటీ చైర్మన్ రామిడి మధుకర్‌రెడ్డి ఈ సంఘం నుంచి రైతులకు అందిస్తున్న ప్రయోజనాలను రుణాలను, ఎరువులు, మందులు, విత్తనాల గురించి వారికి వివరించారు. ఫార్మ్ రైస్ వన్ ప్రాజెక్టు ద్వారా కూరగాయలు, పండ్లు కొనుగోలు కేంద్రాల గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి సిఇఓ, డిసిసిబి జిఎం, ఈ సంఘం వైస్‌చైర్మన్, డైరక్టర్లు, సిఇఓ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ 7వ వార్షికోత్సవ కార్యక్రమాలు..పూజలు



శామీర్‌పేటలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ 7వ వార్షికోత్సవం సందర్భంగ రాష్ట్ర కాంగ్రెస్ కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్‌కు ఆహ్వానపత్రాన్ని అందజేసిన శామీర్‌పేట గౌడ సంఘం ప్రతినిధులు

**శామీర్‌పేట, అక్టోబరు 13, ప్రభాతవార్త**

శామీర్‌పేటలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ 7వ వార్షికోత్సవం సందర్భంగ ప్రత్యేక పూజా కార్యక్రమాలు, కల్యాణోత్సవం, బోనాలు పండుగ మూడు రోజుల పాటు ఉత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శామీర్‌పేట గౌడ సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ నెల 14నుంచి16వ తేదీ వరకు శ్రీరేణుకా ఎల్లమ్మ పండుగ ఉత్సవ కార్యక్రమాలు జరుగనున్నాయి. 14న సోమవారం ఉదయం శామీర్‌పేటలో బొడ్రాయి, గ్రామదేవతలకు కల్యాణం చేసే కుటుంబ సభ్యుల ఒడిబియ్యం, బోనాలు చేసి సమర్పించనున్నారు. సాయంత్రం 7గంటలకు గంగతెప్ప,పుట్టమన్నుకు వెళ్లుట కార్యక్రమాలు జరుగనున్నట్లు తెలిపారు. 15న మంగళవారం ఉదయం 8గంటలకు ఘట్టం, లందకు వెళ్లుట, ఉదయం 11.45గంటలకు శ్రీరేణుకా ఎల్లమ్మ అమ్మవారి కల్యాణం జరుగుతుందన్నారు. 16న బుధవారం మధ్యాహ్నం 2గంటలకు గ్రామం నుంచి శ్రీరేణుకాఎల్లమ్మ ఆలయం వరకు సామూహిక బోనాల ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. సాయంత్రం 7గంటలకు గ్రామం నుంచి దేవాలయం వరకు ఫలహార బండి ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని శామీర్‌పేట గౌడ సంఘం వారు పేర్కొన్నారు. ఆలయంలో జరిగే పూజా కార్యక్రమాల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగ ఆలయ వార్షికోత్సవ పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరుతూ మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్‌ను, మాజీ మంత్రి,మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డిని, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్‌ను, పలువురు జిల్లా, నియోజకవర్గ నాయకులను కలిసి పాల్గొనాలని ఆహ్వానపత్రికలను గౌడ సంఘం ప్రతినిధులు, పలువురు నాయకులు కలిసి వెళ్లి అందజేసి వారిని పాల్గొనాలని కోరారు.

## శామీర్‌పేటలో శ్రీదుర్గామాత లడ్డూను వేలంలో లక్షా 51వేలుకు కైవసం



శామీర్‌పేటలో శ్రీదుర్గామాత లడ్డూను వేలంలో దక్కించుకున్న డిబి వెంకటేశ, అభినందించి సన్మానించిన నిర్వాహకులు,పాల్గొన్న భక్తులు

**శామీర్‌పేట, అక్టోబరు 13, ప్రభాతవార్త**

శామీర్‌పేటలోని శ్రీదుర్గామాత విగ్రహం వద్ద లడ్డూను వేలం వేయగా శామీర్‌పేటకు చెందిన డిబి వెంకటేశ లక్షా 51వేల రూపాయలకు దక్కించుకున్నారు. శామీర్‌పేటలో దసరా పండుగను పురస్కరించుకుని దేవీ శరన్నవరాత్రి పూజలు నిర్వహించి చివరి రోజు లడ్డూను వేలం వేయగా డిబి వెంకటేశ తీసుకున్నారు. లడ్డూను వేలంలో పొందిన డిబి వెంకటేశను నిర్వాహకులు సన్మానించి అభినందించి లడ్డూను అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఆదివారం శ్రీదుర్గామాత విగ్రహాన్ని నిమజ్జనం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించి శామీర్‌పేట గ్రామంలో ఊరేగింపు నిర్వహించి శామీర్‌పేట పెద్ద చెరువుకు నిమజ్జం కోసం నిర్వాహకులు తీసుకవెళ్లారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు. ..శామీర్‌పేట ఉమ్మడి మండలంలోని వివిధ గ్రామాల్లో దసరా పండుగను శనివారం ప్రజలు ఘనంగ జరుపుకున్నారు. గ్రామాల్లోని ఆలయాల వద్దకు వెళ్లి జమ్మిపూజల్లో పాల్గొని దసరాపండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలు గ్రామాల్లో దసరా పండుగ సందర్భంగ రావణాసుర బొమ్మలను ఏర్పాటు చేసి దహనం చేశారు. విజయదశమిని పురస్కరించుకుని విజయోత్సవ కార్యక్రమాలను జరుపుకున్నారు.

## కరెంటు షాక్ తగిలి చిన్నారి మృతి

**అక్కన్నపేట, అక్టోబర్ 13, ప్రభాతవార్త :**

అక్కన్నపేట మండలం పోతారం(జె) గ్రామంలో పండుగ పూట విషాద ఘటన చోటు చేసుకుంది. డీజే నిర్వాహకుల నిర్లక్ష్యానికి ఓ చిన్నారి బలైపోయింది. శనివారం రాత్రి గ్రామంలోని దుర్గామాత డీజే వద్ద తెలి ఉన్న కరెంటు వైర్ కాలికి తగిలి విద్యుత్ షాక్‌తో చిన్నారి కీర్తన్య(7) అక్కడికక్కడే మృతి చెందింది. చిన్నారి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

## ఘనంగా దుర్గామాత నిమజ్జనం



**ధారూర్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** మండల పరిధిలోని నాగారంలో శరన్న వరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజు లపాటు పూజలందుకున్న దుర్గామాతను ఘనంగా నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో శోభాయాత్ర నిర్వహిం చారు. మహిళలు యువతులు నృత్యాలు చేశారు. మంగళహారతులతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు.

## గిరిజనుల సాంప్రదాయాలకు ప్రతీక ముత్యాలమ్మ పండుగ



**కేశంపేట, అక్టోబరు 13, ప్రభాతవార్త:** గిరిజనుల సంస్కృతి సాంప్రదా యాలకు ఆచారాలు నమ్మకాలను ప్రతిబింబించే ప్రత్యేక పడుగ ముత్యాలమ్మ పండు అని సింగిల్ విండో డైరెక్టర్ రాజమోని మధుసూదన్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామపంచాయతీ సచివ లయంలోని బాల్యతండాలో గిరిజనుల సాంద్రాయ పండుగ అయిన ముత్యా లమ్మ పండుగ వేడుకల్లో ముఖ్య అతిధిగా మధుసూదన్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సమాజంలో ముత్యాలమ్మను ఒక శక్తి రూపమైన గ్రామ దేవతగా పూజిస్తారన్నారు. దసరా పండుగ సమయంలో గిరిజనలు తమ ఆచారం ప్రకారం దేవతను కొలిచి ఆయుధ పూజలు చేస్తారు. ఈ కార్యక్రమంలో మాడమోని శేఖర్‌గౌడ్ రాజునా యక్ తండావాసులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మృతురాలు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం



**కేశంపేట, అక్టోబరు 13, ప్రభాతవార్త:** కేశంపేట మండల పరిధిలో తిమ్మగళ్ల సాయమ్మ ఆదివారం తెల్లవారుజామున ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న కేశంపేట సీనియర్ జర్నలిస్టు రమణ గౌడ్ మృతిరాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ తన వంతు సహాయంగా 5000 వేల రూపాయలను మృతిరాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈకార్యక్రమంలో గంజాయి దశరథ తిమ్మగల్ల మల్లేష్ పాండుగౌడ్ ఆంజనేయులు హరికిషన్ రెడ్డి హరికృష్ణ నాగేష్ వెంకటేష్ తిమ్మగల్ల అంజి మహేందర్ యాదయ్య పాల్గొన్నారు.

## బిసి కులగనన అయినకే స్థానిక సంస్థల ఎన్నికలు

### కులగణనకు ప్రజలందరూ సహకరించాలి మంత్రి పొన్నం



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

**హుస్నాబాద్ రూరల్, అక్టోబర్ 13, ప్రభాతవార్త :**

ఈ విజయదశమి ప్రజలందరి జీవితాల్లో నూతన వెలుగులు నింపుతూ..విజయాలు కలిగించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ రేణుక ఎల్లమ్మను ఆయన దర్శించుకున్నారు. దసరా సందర్భంగా వాహన పూజ చేసి కార్యకర్తలతో కలిసి మద్యం సేవించి వాహనాలను నడపరాదని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక, రాజకీయ, ఆర్థిక సర్వే కోసం ప్రభుత్వం జీవో నంబరు 18 విడుదల చేసిందన్నారు. దేశంలోనే ఆదర్శంగా ఉండేలా 60 రోజుల పాటు ఈ సర్వే కొనసాగుతుందన్నారు. ప్రతి పౌరుడికి రాజకీయంగా,సామాజికంగా, ఆర్థికంగా ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఈ సర్వే ఉపయోగ పడుతుందన్నారు. బిసి కులగనన అయినకే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయన్నారు. కులగణనకు ప్రజలందరూ సహ కరించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు,పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## దుర్గామాతను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

**కల్హేర్, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** కల్హేర్ మండల పరిధిలోని మార్డి గ్రామంలో గల దుర్గా మాత ఆలయంలో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా నవరా త్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్టించిన దుర్గామాత విగ్రహం వద్ద గ్రామానికి చెందిన టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సుధాకర్ తదతరులు పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరితో పాటు మండల తాజా మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రామ్‌సింగ్, జిల్లా కో ఆప్షన్ సభ్యులు డాక్టరు అలీ, తాజా మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు జనార్ధన్, వెంకటేష్, దుర్గామాత స్వాములు, గ్రామ ప్రజలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న నాట్యం

**కంగ్టి, అక్టోబరు 13 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కంగ్టిలో ఆదివారం నాడు పోచమ్మ దేవాలయం వద్ద దేవి నవరాత్రిలో భాగంగా చివరి ఆదివారం నాడు పిల్లలకు నాట్యం, డ్యాన్స్ కార్యక్రమాలను చేయిం చారు. ఈ కార్యక్రమంలో పది మంది గ్రూపు ఏర్పడి డ్యాన్స్ నిర్వహిం చారు. గెలుపొందిన మొదటి, రెండవ బహుమతిని, సిద్దేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ దారం వెంకన్న వారితో పాటు యూత్ లీడర్ శ్రీనివాస్‌రెడ్డిలు బహుమతులు అందజేశారు. మిగిలిన వారికి ప్రతి ఒక్కరికి గ్రామస్థులు గంగాధర్, బహుమతిని ఇచ్చారు. ఈ డ్యాన్స్ ప్రోగామ్ ను పోచమ్మ దేవాలయం కమిటీని ఎస్.విజయ్‌కుమార్ సన్మానం చేసి, కమిటీ వారు, ఎస్.ఐ. ని సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, నందుసేటన, అలుగుల సాయిలు భద్రయ్య, అస్తురే సంతోష్‌రెడ్డిలు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**చిన్నశంకరంపేట,అక్టోబర్ 13,ప్రభాతవార్త:** దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో బాగంగా అమ్మవారి అలంకారాలలో చివరి రూపం శ్రీ రాజరాజేశ్వరి దేవి, సకల భువన బ్రహ్మాండాలకు రాజరాజేశ్వరీ దేవి ఆరాధ్య దేవత. ఈ ఉత్సవాలలో చివరి రోజు అమ్మవారు రాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మదూర్ గ్రామంలో దుర్గమ్మ అమ్మవారి వస్త్రాలను వేలం పాట నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో వేలం పాటలో పాల్గొని దక్కించుకున్నారు. అమ్మవారి విగ్రహాన్ని గ్రామ పురవీధుల గుండా ఊరెగించి సమిప చెరువుల్లో నిమజ్జనం చేశారు. అంబాజీపేట, చిన్నశంకరంపేట,శాలీపేట, మాందాపూర్,గవ్వలపల్లిలో దుర్గామాత అమ్మవారి మాలాధార భక్తులు పూజలు నిర్వహించి అమ్మవారి దీక్షను విరమించారు.





న్యాల్‌కల్‌లో జమ్మి చెట్టుకు పూజలు చేసేందుకు ఊరేగింపుగా వెళుతున్న గ్రామస్థులు

## ఘనంగా దసరా వేడుకలు

### ర్యాలీగా వెళ్లి జమ్మిచెట్టుకు పూజలు

**న్యాల్‌కల్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన న్యాల్‌కల్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శనవారం దసరా పండగను పసందుగా భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల నుంచి పట్టణాలకు విద్య, వ్యాపారం, ఉద్యోగం, కూలీ పనులు చేసుకునేందుకు పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లిన వారు తమ తమ స్వగ్రామాలకు చేరుకోవడంతో గ్రామాలు సందడిగా మారాయి. నూతన వస్త్రాలు ధరించి ఉదయం గ్రామాల్లోని ఆలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం గ్రామాల శవారులోని జమ్మి వృక్షాల వద్దకు చేరుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో భవాని మత ఉత్సవ విగ్రహంతో గ్రామస్థులు గ్రామస్థులు గ్రామ శివారులోని జమ్మి చెట్టు వద్దకు చేరుకుని పూజలు నిర్వహించారు. మండలంలోని హద్నూర్ గ్రామంలో గ్రామస్థులు గ్రామంలోని పోలీసు ఠాణాకు చేరుకుని పోలీసు సిబ్బందితో ఆయుధాలను తీసుకుని భజాలు కొడుతుండగా గ్రామస్థులు ఊరేగింపుగా గ్రామంలోని ప్రభుత్వ కళాశాల ఆవరణకు చేరచుని జమ్మి ఆకులకు పూజా కార్యక్రమాలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. జమ్మి ఆకులను తమ స్నేహితులు, బంధువులకు సన్నిహితులకు అందచేసి ఆలిగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలుపుకుని పండగను పసందుగా చేసుకున్నారు.

**మనూర్‌లో..**



**మనూర్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మనూర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం దసరా వేడుకలను ప్రజలు ఆనందోత్సవాలతో భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల నుంచి వ్యాపారాలు, ఉద్యోగాలు, పనులు చేసుకునేందుకు పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లిన వారు తమ పిల్లా పాపలతో దసరా పండగను పురష్కరించుకుని స్వగ్రామాలకు చేరుకోవడంతో గ్రామాలు సందడిగా మారాయి. నూతన వస్త్రాలు ధరించి గ్రామస్థులందరూ సామూహికంగా గ్రామాల శివారులోని జమ్మి చెట్టు వద్దకు చేరుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించి ఒకరికి ఒకరు జమ్మి ఆకులను పంచుకుంటూ ఆలింగం చేసుకుంటూ దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గ్రామాల్లోని తమ సన్నిహితులు, బంధువులు, మిత్రుల ఇండ్లకు చేరుకుని జమ్మి ఆకును అందిస్తూ పండగ శుభాకాంక్షలు తెలుపుకుని పండగను ఆనందత్సోవాలతో ఉత్సాహభరితంగా జరుపుకున్నారు.

**మునిపల్లిలో..**



**మునిపల్లి, అక్టోబరు 13, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మునిపల్లితో పాటు మండలంలోని మల్లారెడ్డిపేట తదితర గ్రామాల్లో శనివారం దసరా పండగను ప్రజలు ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. కొత్త బట్టలు ధరించి తమ పిల్లాపాపలతో గ్రామాల శివారులోని జమ్మి చెట్టు వద్దకు చేరుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జమ్మి ఆకులకు ఒకరికి ఒకరు ఇచ్చిపుచ్చుకుని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండలంలోని మల్లారెడ్డిపేటలో నిర్వహించిన ఉత్సవ వేడుకల్లో పంచాయితీరాజ్ ఎస్ఈ జగదీశ్వర్, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పృథ్వీరాజ్, గ్రామ ప్రముఖులు రామ్‌రెడ్డి, నాగన్న, మల్లన్న, పృథ్వీరాజ్, రాములు, సురేష్, నరసింహారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, యావదయ్య, వీరరెడ్డి, వీరన్న, అంజయ్య స్వామి, నీలయ్యస్వామి, మొగులన్న తదితరులు పాల్గొన్నారు.

**నాగల్‌గిద్ద మండలంలో ..**

**నాగల్‌గిద్ద, అక్టోబరు 13, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన నాగల్‌గిద్దతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం దసరా పండగను ప్రజలు ఆనందోత్సవాలతో భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి గ్రామాల శివారులోని జమ్మి వృక్షం వద్దకు గ్రామస్థులు సామూహికంగా చేరుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించి ఉత్సవాలను భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. జమ్మి ఆకులతో స్నేహితులు, బంధువుల ఇండ్లకు చేరుకుని జమ్మి ఆకులను అందించి ఆలింగం చేసుకుంటూ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

### ఎల్ఐజి కాలనీలో దసర వేడుకలు

**-పాల్గొన్న కార్పోరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి**

**రామచంద్రాపురం, అక్టోబరు 13, ప్రభాతవార్త:** దసరా ఉత్సవాలను శనివారం భారతీ నగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజి కాలనీలో జమ్మి చెట్టుకు పూజా కార్యక్రమాలు నిర్వహించి ఘనంగా జరుపుకున్నారు. ఉత్సవాలు కార్పోరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి నేతృత్వంలో ఘనంగా కొనసాగాయి. సొసైటీ కార్యాలయ ప్రాంగణంలో పటాకులు కాలుస్తూ ఉత్సవాలను ఆనందోత్సవాలతో ఉత్సాహ భరితంగా జరుపుకున్నారు. రావణ దహన సంస్కార కార్యక్రమాలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. ఉత్సవాల్లో డివిజన్ పరిధిలోని ఆయా కాలనీల వాసులు, కార్పోరేటర్ సింధూ ఆదర్శరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### పుల్‌కల్‌లో ఘనంగా దసరా వేడుకలు

**పుల్‌కల్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** ఉమ్మడి పుల్‌కల్ మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం దసరా వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సాయంత్రం గ్రామస్థులు నూతన వస్త్రాలు ధరించి డప్పు చప్పుళ్ల మధ్య గ్రామాల శివారులోని జమ్మి చెట్టుకు వేద బ్రాహ్మణులు వేద మంత్రాలు వల్లుస్తూ పూజా కార్యక్రమాలు నిర్వహించి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని ఆలయాలకు చేరుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించి బంధువులు, స్నేహితులు, సన్నిహితులకు జమ్మి ఆకులు అందించి పండగ శుభాకాంక్షలు తెలుపుకుని పండగను పసందుగా జరుపుకున్నారు.



## పార్లమెంట్ జేసీఓపీ చైర్మన్‌గా ఎంపీ రాజేందర్

**ఘటకేసర్, అక్టోబర్ 13, ప్రభాతవార్త:** పార్లమెంట్ జాయింట్ కమిటీ ఆన్ ఆఫీసెస్ ఆఫ్ ప్రాఫిట్ (జేసీఓపీ) చైర్మన్‌గా నియమితులైన మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి-బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి సన్మానించారు. ఈటల నివాసంలో సుదర్శన్‌రెడ్డి ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్లమెంట్ లాభదాయక కార్యాలయాలపై సంయుక్త కమిటీ చైర్మన్‌గా రాజేందర్‌ను నియమించడం పట్ల వైఎస్ఆర్ హర్షం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన ఎంపీలు ప్రభుత్వాల ద్వారా ఏలాంటి లాభదాయక పనులను నిర్వహిస్తే ఈజాయింట్ కమిటీ ద్వారా వారి సభ్యత్వాల రద్దుకు స్పీకర్‌కు సిఫార్సులు చేయడం ప్రజాధనాన్ని కాపాడే కష్టోడియన్‌లాగా వ్యవహరించే అత్యున్నత పదవి ఈటలకు అప్పగించారని ఆయన పేర్కొన్నారు. మాజీ ఎంపిటిసి నిరుడి రామారావు, గొంగళ్ల బాలేశ్ తదితరులు ఉన్నారు.

## ఘట్‌కేసర్‌లో ఘనంగా విజయదశమి వేడుకలు



**ఘట్‌కేసర్, అక్టోబర్ 13, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ పట్టణంలో ప్రజలు దసరా పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయం వద్ద విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్చకుల మంత్రోచ్చారణాల మధ్య శమీపూజ (జమ్మిచెట్టు)కు ప్రజాప్రతినిధులు, నాయకులు పూజలు చేసిన అనంతరం ప్రజలు ఒకరినొకరు అలింగనం చేసుకొని దసరా శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈసందర్భంగా ఘట్‌కే సర్, ఎదులాబాద్‌లో ఏర్పాటు చేసిన రావణ ప్రతిమను బాణాసంచా కాల్చుతూ దహనం చేశారు. ఎదులాబాద్, చౌదరిగూడ, ఘణాపూర్, వెంకటాపూర్, మాదారం, మర్రిపల్లిగూడ తదితర చోట్ల దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, వైఎస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, మున్సిపల్ బిఆర్ఎస్ అధ్యక్షులు బండారి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపిపి బండారి దాసుగౌడ్, కౌన్సిలర్లు బండారి అంజనేయులు, కడుపొల్ల మల్లేశ్, బేతాల నర్సింగ్‌రావు, కుతాడి రవీందర్, మాజీ ఎంపిటిసి మేకల నర్సింగ్‌రావు, చిల్కూరి గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మెదబోయిన వెంకటేశ్, మాజీ వార్డుసభ్యులు మామిండ్ల చిత్తారియాదవ్, మామిండ్ల ముత్యాలుయాదవ్, నాయకులు గుండోజు కృష్ణాచారీ, అర్చకులు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. దసరా సందర్భంగా పట్టణంలో మద్యం, మాంసం, చికెన్ విక్రయాలు జోరుగా జరిగాయి. ఘట్‌కేసర్ పట్టణంలో దసరా కొనుగోళ్లతో మార్కెట్ రద్దీగా మారి దుకాణాలు కొనుగోలు దారులతో కిటకిటలాడాయి. ఈసందర్భంగా వ్యాపారులు, కార్యాలయాలలో యాజమానులు పూజలు చేశారు. మైసమ్మగుట్ట, శివారెడ్డిగూడ దేవాలయాల ఆవరణలో వాహనపూజలు నిర్వహించారు. బంతి, చామంతి పూలు, గుమ్మడికాయలు, కొబ్బరికాయల అమ్మకాలు జోరుగా జరిగాయి. మద్యం, మాంసం, చికెన్ విక్రయాలు జోరుగా జరిగాయి. దసరాకు ప్రజలు సొంత గ్రామాలకు వెళ్లి వస్తుండటంతో వాహనాలతో హైదరాబాద్-భూపాలపట్నం జాతీయ రహదారిపై విపరీతమైన రద్దీ నెలకొంది.

### జనచైతన్యసేవాసమితి దసరా వేడుకలు-రావణదహనం

**ఘట్‌కేసర్, అక్టోబర్ 13, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లోని గురుకుల్ మైదానం దసరా వేడుకలు అట్టహాసంగా జరిగాయి. జనచైతన్యసేవాసమితి- యువజనసంఘాల సంయుక్త ఆధ్వర్యంలో రాత్రి ఇక్కడ ఉత్సవాలను భారీస్థాయిలో నిర్వహించారు. దసరా సందర్భంగా మైదానంలో విద్యుత్ దీపాలు, పెద్ద టీవీ ప్రదర్శన, జమ్మిచెట్టుపూజ, అలయ్‌బలయ్, రావణదహనం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వందలాది మంది ఘట్‌కేసర్ పట్టణ వాసులు చేరుకొని దసరా వేడుకల్లో పాల్గొని ఆనందాన్ని పంచుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్ దంపతులు పాల్గొని జమ్మిచెట్టుకు అర్చకుల మంత్రోచ్చారణాల మధ్య శమీ పూజలు చేశారు. వేడుకల్లో భాగంగా ఆకాశంలో వివిధ రకాల బాణాసంచాల శబ్దాలు, మిరుమిట్లు గొల్పిన కాంతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భారీ 50 అడుగుల రావణ ప్రతిమను తయారుచేసి బాణాసంచా శబ్దాలు, ఆకాశంలో తరాజువ్వల కాంతుల నడుమ రావణుడి ప్రతిమను లంకను దహనం చేశారు. వివిధ రకాలుగా మిరుమిట్లు గొల్పిన పలు భాణాసంచాలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం అలయ్‌బలయ్ కార్యక్రమం జరుగగా ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజలను అలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలిపి కార్యక్రమం నిర్వహించినందుకు మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్‌ను అభినందించారు. మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ యాదగిరిల చేతుల మీదుగా ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులను అందజేశారు.

## మున్సిపల్ కార్మికులకు దుస్తుల పంపిణీ



**ఘట్‌కేసర్, అక్టోబర్ 13, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. దసరా పండుగ సందర్భంగా చైర్‌పర్సన్ తన సొంత డబ్బులతో కార్మికులకు చీరెలు, వస్త్రాలు కొనుగోలు చేసి అందజేశారు. ఘణాపూర్, ఎదులాబాద్, మర్రిపల్లిగూడ, మాదారం కార్మికుల సంక్షేమానికి ఎల్లప్పుడు కృషి చేస్తామని కోవిడ్ సమయంలో కార్మికులు అందించిన సేవలు మరువలేనివని, ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి రెండుసార్లు జాతీయస్థాయి శుభ్రత అవార్డులు రావడంలో కార్మికులు పాత్ర కీలకమన్నారు. కార్మికులకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేసి ఆమె కానుకలను అందించారు. ఈకార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతులు అందజేత

**చిన్నశంకరంపేట,అక్టోబర్ 13,ప్రభాతవార్త:** మండల పరిధి కొర్విపల్లి తండాలో సేవాలాల్ యూత్ సభ్యులు మండల స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ టోర్నమెంట్ మొత్తంలో 15 జట్లు పాల్గొనగా ఫైనల్‌కు ధర్పల్లి,గవ్వలపల్లి తండాలు చేరుకున్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్ పోరులో విజేతగా నిలిచిన ధర్పల్లి జట్టుకు రూ.6వేల నగదుతో పాటు ప్రైజ్‌ను అందించారు. అలాగే రన్నర్‌గా నిలిచిన గవ్వలపల్లి తండా జట్టుకు రూ.3వేల నగదును అందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ సర్పంచి రాజిరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పట్లోరి రాజు, నాయకులు జీవన్,పుల్లారావు,రాజశేర్‌రెడ్డి, ఎస్టీ సెల్ లాలు నాయక్, కుమ్మరి ప్రవీణ్,యూత్ సభ్యులు వినోద్, శివ,ప్రవీణ్,సందీప్‌లు పాల్గొన్నారు.

## ఘనంగా దసరా ఉత్సవాలు

**చిన్నశంకరంపేట, అక్టోబర్ 13,ప్రభాతవార్త:**

మండల వ్యాప్తంగా దసరా వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం కొత్త దుస్తులు ధరించి, పాలపిట్ట దర్శనం కోసం గ్రామ శివారులకు వెళ్లారు. శమి వృక్షాలకు పూజలు నిర్వహించారు. భక్తులందరూ ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి,స్నేహితులకు జంబి అందించి, ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నశంకరంపేట పట్టనంలో రావణ దహనం చేశారు.